
*Licensed to post with*
*payment at RMS, Hyd*




## UDBHAVA

Edited, Printed, Published and owned by
**Dr. M. Madhava Vasu** and Printed at Saraswathi Printers,
Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta,
Alwal, Secunderabad - 500 015. Telangana and
Published at Plot No.1, 1-24-21/4, (24-387),
Sri Sai Nagar, Lothukunta, Alwal,
Secunderabad - 500 015, Telangana.
Editor : Dr. M. Madhava Vasu,
RNI No: 87195 (APTEL/2005/14638)
Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com
**www.udbhavamagazine.com**



పోక్సో దుర్వినియోగంపై
సుప్రీంకోర్టు ఆందోళన

# ఉద్భవ

**www.udbhavamagazine.com**

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

**Volume : 20 Issue: 5 August 2026 Pages: 72 Rs.10**



# బాలికలకు రక్షణ ఏది?

## మైనర్లపై పెరుగుతున్న హత్యాచారాలు

# ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం /
స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

Regn. No. 87195 (APTEL/2005/14638)

**Volume: 20 * Issue: 5 * August 2026 * Pages: 72 Rs.10**

*www.udbhavamagazine.com*



Founder and Editor in Chief

**Dr. M. Madhava Vasu**

M.A., M.H.R., M.Phil (JMC), P.G.H.R., Ph.D., F.D.R. (Nalsar), B.P.R., DEE.

**Advisors:**

**Sri M. Madhusudhan Reddy**
Advocate

**Sri P. Balreddy**
Advocate

**Sri S. Mohan Rao**
Journalist

Kakinada Correspondent :
**Sri D. Venugopal Rao**


## లోపలి పేజీల్లో...


- బాలికలకు రక్షణ ఏది? 3
- రాజస్థాన్‌లో రాక్షసకాండ 5
- షాబాద్‌లో ఉన్మాది నరమేధం 7
- మీ పేరు ముందు 'డాక్టర్'ను తొలగించండి 12
- టీనేజ్ ప్రేమికులు పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపుతుంది? 15
- జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం 18
- ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కారు 22
- ఢిల్లీ పోలీసులపై ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్ 34
- లింగ సమానత్వానికి వార్షిక లోటే అడ్డు 36
- సహజీవనానికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి 40
- రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన ముఖ్యం 43



**UDBHAVA**
Edited, Printed, Published and Owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com


**UDBHAVA**
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.


**DISCLAIMER**
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.



**ACKNOWLEDGEMENT OF THE SOURCE**
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

## సంపాదకీయం

# ఓ బాలికా.. తస్మాత్ జాగ్రత్త..

పాఠశాలకు వెళ్లే బాలికైనా, ఇంటిపట్టున ఉండే నిరుపేద బాలికైనా.. ఆఖరికి దివ్యాంగురాలైనా – మూడేళ్లు దాటితే చాలు – మాన ప్రాణాలకు రక్షణ కొరవడుతోంది. ఎన్నో కలలతో, మరెన్నో ఆశలతో జన్మను పొందిన బాలిక భవిష్యత్తు నేడు ప్రమాదపుటంచుల్లో ఉంది. మద్యం మత్తులో, ఉన్మాదపు చేష్టలతో ఏ మూల నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం తల్లిదండ్రుల్లోనే కాదు.. యావత్ సమాజాన్ని నిత్యం వెంటాడుతోంది. బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడి, హత్యల ఘటనలే ఇందుకు తార్కాణం. అత్యాచారం అనేది కేవలం శారీరక దాడి మాత్రమే కాదు, అది బాధితురాలి వ్యక్తిత్వాన్ని కూడా పూర్తిగా దెబ్బతీస్తుంది అని బాంబే హైకోర్టు ఓ తీర్పు సందర్భంలో చేసిన వ్యాఖ్య అక్షర సత్యం. పసివయసులో ఆ చిన్నారిపై జరిగే లైంగిక దాడి అనేక దుష్పరిణామాలకు నాంది పలుకుతుంది. ఆ బాలిక వ్యక్తిత్వంపైనా, ఆత్మవిశ్వాసంపైనా, మానసిక ఎదుగుదలపైనా తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. దీంతో పాటు సమాజంలో ఆ బాలికకు అడుగడుగునా ఎదురయ్యే అవమానాలు... నలుగురిలో స్వేచ్ఛగా తిరగలేని దుస్థితి... పాఠశాలలో కనీసం అడుగుపెట్టలేని నిస్సహాయ స్థితి. ఈ పరిస్థితి ఆ బాలికకు ఎందుకొచ్చింది? ఆమె చేసిన తప్పేంటి? దీనికి కారకులెవరు? ప్రశ్నలు ఒకటే అయినా ఘటన బట్టి, సందర్భాన్ని బట్టి సమాధానాలు మారిపోతుంటాయి.

బాలికలను రక్షించుకోవటం ఇప్పుడున్న పరిస్థితుల్లో అందరి బాధ్యత. కేవలం బాలిక కుటుంబానిది మాత్రమే కాదు. పాఠశాలది, పరిసరాలది, సమాజానిది, ప్రభుత్వ వ్యవస్థలది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది. అంతేకాదు – ప్రతి బాలిక తనను తాను రక్షించుకునేలా తీర్చిదిద్దబడాలి. తనలో చైతన్యాన్ని, ఎలాంటి దాడినైనా ఎదిరించగలనన్న ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి.

*అయినా... ఓ బాలికా... నువ్వు జాగ్రత్త!*



# బాలికలకు రక్షణ ఏది?

మైనర్ బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు
అత్యాచారాలు, హత్యలకు తెగబడుతున్న వైనం
ఏమరుపాటుగా ఉంటే మృగాళ్ల వలలో చిక్కినట్టే
తల్లిదండ్రులు, ప్రభుత్వ వ్యవస్థల అప్రమత్తత అవసరం
బాలికల్లో చైతన్యం తీసుకురావాల్సిన అత్యవసర పరిస్థితి

బాలికల భవిష్యత్తు రోజురోజుకీ ప్రమాదంలో పడుతోంది. స్కూలుకు వెళ్లిన బాలిక క్షేమంగా తిరిగొస్తుందో రాదోనని భయం పెరిగిపోతోంది. బాల్యంలో సహజంగా ఉండే అమాయకత్వం ఎవరి మాయమాటలకు బలైపోతుందోననే అభద్రతా భావం ఆడపిల్ల తల్లిదండ్రుల్లో కనబడుతోంది. పిల్లల మీద నమ్మకం

కన్నా ఎవరు ఏమారుస్తారోనన్న ఆందోళన వేళ్లూనుకుంటోంది. ఇటీవలి కాలంలో తరచూ జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు చూస్తుంటే బాలికల భవిష్యత్తు ఎంతటి భయానక పరిస్థితుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ముక్కుపచ్చలారని అమాయక బాలికలపై అలాంటి భావన కలగడం సమాజంలో పెరుగుతున్న పైశాచిక ప్రవృత్తికి నిదర్శనం. బాలికలు గర్భం దాల్చిన ఘటనలు కూడా లెక్కకు మించి ఉన్నాయి. పోక్సో వంటి చట్టాలు బలంగా ఉన్నా, కఠిన శిక్షలు పడతాయని తెలిసినా అత్యాచారాలు, హత్యలకు



పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. మద్యం మత్తులో కొందరు, మాయమాటలు చెప్పి మరికొందరు - ఒకటేమిటి బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సవాలక్ష కారణాలు. బాలికల అమాయకత్వం, ఏం జరుగుతోందో తెలియని - తెలుసుకోలేని వయసులో మృగాళ్ల బారిన పడితే వారు పడే శారీరక, మానసిక వ్యథ చెప్పనలవి కాదు. జాతీయ గణాంకాల ప్రకారం పిల్లలపై జరుగుతున్న నేరాలు రెట్టింపయ్యాయి. పోక్సో బాధితుల సంఖ్య కూడా దాదాపుగా రెట్టింపు నమోదయ్యాయి. మైనర్లపై జరుగుతున్న లైంగిక హింస తీవ్రతకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే అటు తల్లిదండ్రులు, ఇటు ప్రభుత్వ వ్యవస్థలు, పాఠశాలలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. బాలికల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు ఎలాంటి పరిస్థితి ఎదురైనా తమంతతాముగా బయటపడేందుకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇప్పించాలి. ఒక్కరుగా కాకుండా జట్టుగా ఇళ్లకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి. ఇలాంటి ఎన్నో రక్షణ చర్యలు ఇల్లు, పాఠశాల, పరిసరాల్లో తమంత తాముగా ఏర్పాటుచేసి బాలికలకు రక్షణ వలయం ఏర్పాటుచేయాలి.

# రాజస్థాన్‌లో రాక్షసకాండ

## 13 ఏళ్ల బాలికపై
## 30 మంది మృగాళ్ల పైశాచిక దాడి

రాజస్థాన్‌లో వెలుగుచూసిన మృగాళ్ల అరాచకం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. 13 ఏళ్ల మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లిన దుండగులు, ఆమెను ఓ హోటల్ యజమానికి విక్రయించడం.. అనంతరం ఐదు రోజుల పాటు ఒక హోటల్ నుంచి మరో హోటల్‌కు తరలిస్తూ 30 మందికి పైగా వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెలుగులోకి రావడం దేశాన్ని షాక్‌కు గురిచేసింది. బాధితురాలు చెప్పిన వివరాలు, పోలీసుల దర్యాప్తులో బయటపడిన విషయాలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలకు దిగడమే కాకుండా, కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హోటళ్లపై బుల్డోజర్ యాక్షన్ చేపట్టింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో చోటుచేసుకుంది. జూన్ 18న ఇంటి నుంచి అదృశ్యమైన 13 ఏళ్ల బాలికను ఓ ఆటోడ్రైవర్ స్థానిక హోటల్ యజమానికి అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. అక్కడి నుంచి బాలికకు అసలు నరకం ప్రారంభమైంది. వివిధ హోటళ్ల యజమానులు, నిర్వాహకులు పరస్పర సహకారంతో ఆమెను ఐదు రోజుల పాటు వేర్వేరు హోటళ్లకు తరలిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదైంది. ఈ ఘోరానికి కొందరు హోటల్ నిర్వాహకులు ప్రత్యక్షంగా సహకరించడమే కాకుండా, విషయం బయటకు రాకుండా ఆధారాలు చెరిపివేయడానికి కూడా ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఇచ్చిన వాంగ్మూలం కేసులో మరింత సంచలనంగా మారింది. నిరంతర అత్యాచారాల కారణంగా తీవ్ర నొప్పితో బాధపడుతూ ఏడుస్తుంటే, ఆమెను మౌనం పాటించేలా బలవంతంగా మద్యం తాగించేవారని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే 12 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే శ్రీగంగానగర్ జిల్లాలో ప్రజలు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. నిందితులందరికీ ఉరిశిక్ష

విధించాలని, ఈ నేరానికి వేదికగా మారిన అక్రమ హోటళ్లన్నింటినీ కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకున్న జిల్లా యంత్రాంగం, కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న నాలుగు హోటళ్లను బుల్డోజర్లతో కూల్చివేసింది. అక్రమ నిర్మాణాలపై కూడా ప్రత్యేక తనిఖీలు చేపట్టగా, జిల్లాలో వందకు పైగా అనుమానాస్పద హోటళ్ల కార్యకలాపాలపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన రాజకీయంగానూ పెద్ద దుమారమే రేపింది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా విమర్శించారు. నిందితులతో పాటు వారికి సహకరించిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై కూడా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం చేయడంతో పాటు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అక్రమ హోటళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కేసుపై జిల్లా ఎస్పీ హరిశంకర్ స్పందిస్తూ.. దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతోందని, నిందితులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

# సుమోటోగా తీసుకున్న జాతీయ మహిళా కమిషన్

రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన ఘోరమైన సామూహిక అత్యాచారం, మానవ అక్రమ రవాణా ఉదంతాన్ని జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సుమోటోగా స్పందించిన జాతీయ మహిళా కమిషన్, స్థానిక యంత్రాంగం మరియు పోలీసుల వైఫల్యాలను ఎండగట్టింది. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి, 15 రోజుల్లోగా 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' (చర్యల నివేదిక) సమర్పించాలని శ్రీ గంగానగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పిలను ఆదేశించింది. ఈ ఘోరం జరగడానికి స్థానిక పోలీసుల పర్యవేక్షణ లోపం, పరిపాలనాపరమైన నిర్లక్ష్యమే కారణమని ఛైర్‌పర్సన్ విజయా రహాత్కర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాలికను బంధించి అఘాయిత్యానికి పాల్పడిన ఇలాంటి అక్రమ హోటళ్లు, లాడ్జీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాటిని వెంటనే మూసివేయాలని ఆదేశించింది. పోలీస్, వైద్య, మరియు ఫోరెన్సిక్ విభాగాలు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. నిందితులకు త్వరగా శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి,

బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించింది. బాలికకు తగిన రక్షణ కల్పించడంతో పాటు, ఆమె కోలుకోవడానికి అవసరమైన వైద్య, మానసిక సహాయం మరియు పునరావాస చర్యలు చేపట్టాలని సూచించింది.

# పోక్సో కేసు పెట్టారని..

# షాబాద్‌లో ఉన్మాది నరమేధం

## ఆరుగురిని గొంతు కోసి చంపిన కిరాతకుడు

## మైనర్ బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు

## తన భార్య, ఇద్దరు కుమారుల దారుణ హత్య

## మైనర్ బాలికను వేధించడంతో కేసు పెట్టిన బాలిక కుటుంబం

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో అత్యంత దారుణం చోటుచేసుకుంది. మైనర్ బాలికను వేధించినందుకు పోక్సో కేసు పెట్టారని కక్షగట్టిన ఓ ఉన్మాది కిరాతకానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి ఆరుగురిని దారుణంగా హత్య చేశాడు. మైనర్ బాలిక, ఆమె తల్లి, నానమ్మతోపాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్యను, ముక్కుపచ్చలారని ఇద్దరు పసిపిల్లలను గొంతుకోసి చంపాడు. ఈ నరమేధం తీవ్ర సంచలనం రేకెత్తించింది. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం కూడా ఉండడంతో ప్రజాగ్రహం పెల్లుబికింది. నిందితుడు పార్వతి రాజ్‌కుమార్ (35) చేతిలో బలైన వారిలో మైనర్ బాలిక (17), ఆమె తల్లి చిట్యాల లక్ష్మి(45), బాలిక నానమ్మ చిట్యాల రుక్కమ్మ(65)తోపాటు అతని భార్య సరిత(30), కుమారులు పరీక్షిత్(4), దైవీక్షిత్(2) ఉన్నారు. షాబాద్ మండలం దైవాలగూడకు చెందిన రాజ్‌కుమార్ 2018లో సరితను ప్రేమవివాహం చేసుకున్నాడు. వీరి పెళ్లికి ఇరువైపు కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో షాబాద్ మండల కేంద్రంలో ఇంటిని కొనుగోలు చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. అతనికి 8 ఎకరాల భూమి ఉండగా.. జల్సాలకు అలవాటుపడ్డ రాజ్‌కుమార్ కొంత భూమిని అమ్మేశాడు. ఈ క్రమంలో షాబాద్‌లో తన ఇంటి సమీపంలో ఉన్న ఓ బాలికపై కన్నేశాడు. ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లితండ్రులు రాజ్‌కుమార్‌ను హెచ్చరించారు. శంషాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను క్లాసులు మాన్పించారు. కేవలం

పరీక్షలు రాసేందుకు వారు వెంట ఉండి తీసుకువెళ్లారు. పరీక్ష రాసేందుకు వెళ్లిన సమయంలో శంషాబాద్‌లో కాలేజీ నుంచి వస్తున్న బాలిక వెంటపడి బలవంతంగా ఆమెను కారులో ఎక్కించుకునేందుకు యత్నించాడు. బాలిక తల్లి అతణ్ని అడ్డుకొని కూతురిని కాపాడుకుంది. అనంతరం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రాజ్‌కుమార్‌పై మే 16న పోక్సో కేసు నమోదు చేశారు. అయితే అన్నీ బెయిలబుల్ సెక్షన్లు కావడంతో.. అప్పటినుంచి తప్పించుకు తిరిగిన రాజ్‌కుమార్ ఇటీవలే ఎల్బీనగర్‌లోని స్పెషల్ సెషన్స్ జడ్జి పోక్సో కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందాడు. అనంతరం.. తనపై కేసు పెట్టారన్న కసితో రాత్రి సమయంలో బాలిక ఇంట్లోకి చొరబడి ఆమె తల్లి లక్ష్మిని, నానమ్మ రుక్కమ్మను కత్తితో గొంతుకోసి కిరాతకంగా హతమార్చాడు.

వికలాంగురాలైన బాలిక అక్క మేఘన(19) కూడా ఇంట్లోనే ఉండగా.. ఆమెను మాత్రం చంపకుండా వదిలేశాడు. అనంతరం బాలికను బలవంతంగా లాక్కెళ్లి తన కారులో ఎక్కించుకున్నాడు. షాబాద్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన స్వగ్రామమైన దైవాలగూడ సమీపంలోని చెరువు వద్దకు తీసుకువెళ్లి దారుణంగా హత్య చేశాడు. బాలిక హత్య తరువాత రాజ్‌కుమార్ నేరుగా తన ఇంటికి చేరుకుని.. నిద్రిస్తున్న తన భార్యను లేపాడు. తన కుమారులు పరిక్షిత్, దైవిక్షిత్‌లను కత్తితో పొడిచి చంపడానికి యత్నిస్తుండగా భార్య అడ్డుపడింది. దీంతో కత్తితో ఆమె కడుపులో పొడిచి చంపాడు. అనంతరం ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. ఆ తర్వాత తన తల్లితండ్రులకు ఫోన్ చేసి.. ఆరుగురిని చంపిన విషయం చెప్పాడు. తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి షాబాద్ నుంచి పరారయ్యాడు. కాగా, ఉన్మాదిలా మారి ఆరుగురిని అత్యంత దారుణంగా హతమార్చిన రాజకుమార్ రెండురోజుల అనంతరం కొత్తూరు సమీపంలోని పెంజర్ల వద్ద శవమై కనిపించాడు. పరారీలో ఉన్న రాజ్‌కుమార్‌ను గాలిస్తున్న క్రమంలో అతడు మృతదేహం లభించడం చర్చనీయాంశంగా మారింది.

# చాక్లెట్ల ఆశ చూపి బాలికపై అత్యాచారం

హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రెహాన్ అనే వ్యక్తి.. బాధితురాలి ఇంటి ముందు పండ్లు అమ్ముకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలోనే బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆ బాలికపై కన్నేసిన రెహాన్.. గత మే నెలలో తన ఇంట్లో చాక్లెట్లు, బిస్కెట్లు ఉన్నాయని నమ్మించి ఆమెను లోపలికి తీసుకెళ్లి

బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. దీంతో బాలిక భయంతో కొన్ని నెలల పాటు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా దాచింది. ఇటీవల నిందితుడు రెహాన్ మరోసారి సదరు బాలికను వేధించడం ప్రారంభించాడు. దీంతో భరించలేకపోయిన బాధితురాలు జరిగిన ఘోరాన్ని తన తల్లిదండ్రులకు వివరించింది. ఈ విషయమై ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు వెంటనే కెపిహెచ్‌బి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు సంబంధిత కలిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రెహాన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# ఘజియాబాద్‌లో ఏడేళ్ల చిన్నారిపై...

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఓ షాపింగ్ మాల్ బేస్‌మెంట్‌లో ఏడేళ్ల చిన్నారి మృతదేహం తీవ్ర కలకలం రేపింది. పోస్టుమార్టం నివేదికలో బాలికపై అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ కావడంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలోని నంద్‌గ్రామ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత చిన్నారి తల్లిదండ్రులు అదే నిర్మాణ స్థలంలో కూలీలుగా పనిచేస్తూ అక్కడే ఓ గుడిసెలో నివసిస్తున్నారు. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. మర్నాడు ఆ మాల్ బేస్‌మెంట్‌లో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతదేహంపై తీవ్రగాయాలు ఉండటం, పలు ఎముకలు విరిగిన ఆనవాళ్లు కనిపించడంతో వెంటనే నంద్‌గ్రామ్ పోలీసులకు సమాచారం అందించారు.

పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. చిన్నారిని మాల్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో భాగంగా అనుమానిస్తున్నారు. అయితే ఘటన ఎలా జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు ఫోరెన్సిక్ బృందం రంగంలోకి దిగి ఆధారాలు సేకరిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అత్యాచారం, హత్య, అపహరణ, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు నలుగురు నుంచి ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

# రాజస్థాన్‌లో 7 ఏళ్ల బాలికపై...

రాజస్థాన్‌లోని బార్మేర్‌లో ఏడేళ్ల బాలికపై అత్యాచారం జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. నిందితుడు బాలికను ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి, ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. ఆ బాలిక తన ఇంటి ముందు ఆడుకుంటుండగా, అదే ప్రాంతానికి చెందిన ఒక యువకుడు అక్కడికి వచ్చాడు. అతడు ఒక అపరిచిత వ్యక్తి పేరు చెప్పి, ఆ వ్యక్తి ఎక్కడ ఉంటాడో చూపించమని ఆ బాలికను అడిగాడు. ఈ సాకుతో అతను ఆ అమ్మాయిని తనతో పాటు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆమెను పొదల మధ్య ఉన్న ఒక ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి, అత్యాచారం చేశాడని ఆరోపణ. ఆ అమ్మాయి బాధతో విలవిలలాడుతూ ఏడుస్తూ ఇంటికి తిరిగి వచ్చి కుటుంబ సభ్యులకు వివరించింది. అది విన్న కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురై, వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను నమోదు చేశారు. అంతేకాకుండా, పూర్తి వివరాలు సేకరించేందుకు ఒక పోలీసు బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు ఆ బాలిక ఇంటిని కూడా సందర్శించింది. ఈ దారుణమైన ఘటన తర్వాత ఆ బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నిందితుడి పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి, తేజ్ సింగ్ కుమారుడైన మాఘ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, ఆ బాలికకు వైద్య పరీక్షలు కూడా చేయించారు. ఈ కేసు వివరాలను వెల్లడిస్తూ బార్మేర్ ఏఎస్పీ నితేష్ ఆర్య నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సమగ్ర విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. బాధితురాలికి (మైనర్ బాలికకు) వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారంపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

**బెంగాల్ బాలిక హత్యాచారం కేసు.. ఎన్‌కౌంటర్‌లో అనుమానితుడి హతం..**

పశ్చిమ బెంగాల్‌కు చెందిన 11 ఏళ్ల బాలిక హత్యాచారం కేసులో పోలీసులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ముగ్గురిలో ఓ అనుమానితుడు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 11 ఏళ్ల బాలిక హత్యాచారం కేసులో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిలో ప్రవాశ్ మండల్ ఒకడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ముగ్గురిని బరూయ్‌పూర్ తీసుకెళ్లారు. అక్కడ క్రైమ్ సీన్

రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న సమయంలో ప్రవాశ్ పోలీసుల నుంచి తుపాకి లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ప్రవాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రవాశ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు.

మరో ఘటనలో దక్షిణ 24 పరగణాస్‌కు చెందిన 6వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలిక తన స్నేహితురాలి పుట్టినరోజు సందర్భంగా బహుమతి కొనడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కానీ, రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మర్నాడు బాలిక మృతదేహం ఓ చెరువులో కనిపించింది. పోస్టుమార్టం రిపోర్టులో బాలిక అత్యాచారం అనంతరం హత్యకు గురైనట్లు బయటపడింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

### మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం

# 65 ఏళ్ల నిందితుడికి మరణశిక్ష

మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం కేసులో ప్రత్యేక కోర్టు ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసును 'అత్యంత అరుదైన కేసు'గా పరిగణించిన న్యాయస్థానం, పుణె జిల్లా నస్రాపుర్ గ్రామానికి చెందిన 65 ఏళ్ల భీమ్‌రావ్ కాంబ్లేకు మరణశిక్ష విధించింది. నిందితుడికి ఎలాంటి ఉపశమనం కల్పించే అవకాశం లేదని స్పష్టం చేసింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించగా, కేవలం 2 నెలల్లోనే విచారణ పూర్తి చేసి, తీర్పు ఇవ్వడం గమనార్హం. 2026 మే 1న పుణె జిల్లా నస్రాపుర్ గ్రామంలో ఆ దారుణ అత్యాచారం, హత్య ఘటన జరిగింది. కొత్తగా పుట్టిన దూడను చూపిస్తానని, తినడానికి చిరుతిండి ఇస్తానని ఆశ చూపి 3 ఏళ్ల చిన్నారిని భీమ్‌రావ్ తన వెంట తీసుకెళ్లాడు. గ్రామ శివారులోని పశువుల షెడ్డులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పాప అరవకుండా నోరు మూసి, ఛాతిపై తీవ్రంగా కొట్టి, అత్యంత క్రూరంగా హత్య చేశాడు. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. చివరకు పశువుల షెడ్డులో బాలిక మృతదేహం కనిపించడంతో, వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను పరిశీలించి ఈ ఘాతుకానికి పాల్పడిన భీమ్‌రావ్‌ను అరెస్ట్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేశారు. విచారణలో దోషిగా తేలిన భీమ్‌రావ్‌కు కోర్టు ఉరి శిక్షను ఖరారు చేసింది.

## అత్యాచారానికి గురైన నాలుగేళ్ల చిన్నారి కేసు

# మీ పేరు ముందు 'డాక్టర్'ను తొలగించండి

## వైద్యులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

## సరైన వైద్యం అందకపోవడంతో బాలిక మృతి

## పేదలు కాబట్టే నిర్లక్ష్యం చేశారని వ్యాఖ్య

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అత్యాచారానికి గురైన నాలుగేళ్ల చిన్నారి కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యాచారానికి గురైన ఆ చిన్నారికి సరైన వైద్యం అందించకపోవడంతో మృతి చెందడంతో సదరు వైద్యులపై సుప్రీంకోర్టు మండిపడింది. సరిగ్గా విధులు నిర్వహించనప్పుడు పేరుకు ముందు డాక్టర్ అనే పదాన్ని రాసుకునే హక్కు ఆ వైద్యులకు లేదని వ్యాఖ్యానించింది. ఆ పసిపాప విషయంలో మానవత్వం చూపించి ఉంటే.. సరైన వైద్య సదుపాయాలు లేనప్పుడు ఆ బిడ్డను మరో ఆస్పత్రికి పంపేవారని సుప్రీంకోర్టు పేర్కొంది. బాధితురాలి కుటుంబం పేదది కావడం, వైద్య ఖర్చులు భరించలేకపోవడం వల్లే ఆ చిన్నారి ప్రాణాలను నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మార్చి 16న ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఓ వ్యక్తి చాక్లెట్లు కొనిస్తానని చెప్పి నాలుగేళ్ల చిన్నారిని తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం బాలికపై అత్యాచారానికి పాల్పడి.. అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గుర్తించారు. తొలుత రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లగా... బాలికను చేర్చుకునేందుకు వైద్యులు నిరాకరించారు. చివరకు ఘజియాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై విచారణకు సుప్రీం కోర్టు నియమించిన సిట్.. వైద్యులు, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయకపోవడంతో పోలీసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

అలానే సకాలంలో చిన్నారికి చికిత్స అందించని రెండు ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులను తీవ్రంగా మందలించింది. మృతురాలి కుటుంబానికి పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# మూడేళ్ల బాలికపై అత్యాచారం.. జరిమానా డబ్బుతో పంచాయతీ పెద్దల పార్టీ

మూడేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటనను కప్పిపుచ్చేందుకు గ్రామ పంచాయతీ పెద్దలు ప్రయత్నించిన తీరు విమర్శలకు దారి తీసింది. పైగా నిందితుడికి విధించిన జరిమానా డబ్బుతోనే వారంతా విందు చేసుకోవడం కలకలం రేపింది. గ్రామస్థుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ ఘటన జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘాఘ్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన సునీల్ లోహ్రా గత శనివారం సాయంత్రం బాధిత చిన్నారి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో బాలిక తల్లి ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా.. చిన్నారిని తాను చూసుకుంటానంటూ నమ్మబలికాడు. అనంతరం ఇంటి లోపలికి తీసుకెళ్లి ఓ గదిలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కొంతసేపటికి చిన్నారి గట్టిగా ఏడుస్తూ, తీవ్ర ఇబ్బందితో బయటకు రావడాన్ని తల్లి గమనించింది. వెంటనే చిన్నారిని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధిత కుటుంబం బయలుదేరగా.. గ్రామ పంచాయతీ పెద్దలు జోక్యం చేసుకున్నారు. విషయం బయటకు వెళ్లకుండా గ్రామంలోనే పరిష్కరించాలని పట్టుపట్టారు. పంచాయితీ పెట్టి సునీల్ లోహ్రాకు రూ.లక్ష జరిమానా విధించారు. నిందితుడు తొలుత రూ.20 వేలు చెల్లించగా.. మిగిలిన రూ.80 వేలు వారంలోగా చెల్లించాలని ఆదేశించారు. అయితే, ఆ రూ.20 వేలను బాధిత కుటుంబానికి ఇవ్వకుండా పంచాయతీ పెద్దలు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. మాంసం, మద్యంతో విందు ఏర్పాటు చేసుకుని సంబరాలు చేసుకోవడం ప్రారంభించారు. అదే సమయంలో విషయం ఘాఘ్రా పోలీసుల దృష్టికి వెళ్లింది. స్టేషన్ ఇన్‌ఛార్జ్ మోహన్ కుమార్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే జరిమానా డబ్బులతో ఏర్పాటు చేసిన విందు కొనసాగుతోంది. బాధితురాలి తల్లిని కలువగా.. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సునీల్ లోహ్రాను అరెస్టు చేశారు. పంచాయతీ పెద్దలపైనా చర్యలకు

ఉపక్రమించారు. అయితే, చిన్నారిపై అత్యాచారాన్ని కప్పిపుచ్చేందుకు యత్నించిన గ్రామ పెద్దలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్ట ప్రకారం నిందితుడిపై చర్యలు తీసుకోకుండా అడ్డుకోవడంపై మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# బాలలపై లైంగిక వేధింపు కంటెంట్ నిరోధానికి కఠిన చర్యలు

## కేంద్రం నోటీసులకు మెటా వివరణ

ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌ల రికమెండేషన్ అల్గారిథమ్స్ పిల్లలపై లైంగిక వేధింపుల కంటెంట్‌ను ప్రోత్సహించేలా ఉండడం, వాటిలో వచ్చే కొన్ని ప్రకటనల్లో బాలలపై లైంగిక వేధింపుల కంటెంట్ ఉండడంపై వివరణ కోరుతూ కేంద్రం జారీ చేసిన నోటీసులపై మెటా స్పందించింది.

ఆ తరహా కంటెంట్‌ను అరికట్టడానికి తమ యాప్స్‌లో తీసుకుంటున్న కఠినమైన చర్యల గురించి ఒక బ్లాగు పోస్టులో వివరించింది. దీనికి అడ్డుకట్టవేయడానికి అధునాతన ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, వాటి సాయంతో అలాంటి ఖాతాలను గుర్తించి తొలగిస్తున్నామని.. గత ఏడాది ఇలా 40లక్షల ఖాతాలను తొలగించామని.. తప్పుడు లింకులను బ్లాక్ చేస్తున్నామని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా తమ యాప్స్‌ను వాడేవారిలో 98% మంది మాట్లాడే భాషలను కవర్ చేసేలా తమ కొత్త ఏఐ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసినట్టు పేర్కొంది. గడిచిన ఆర్నెల్లలో ఒక్క భారతదేశంలోనే తమ ఏఐ టూల్స్.. ఇలాంటి లక్షా అరవై వేల ఖాతాలను తొలగించినట్టు మెటా వెల్లడించింది. కాగా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలను మెటా ఉద్దేశపూర్వకంగానే యువ వినియోగదారులను బానిసలుగా మార్చేలా రూపొందించిందని, వాటి భద్రతపై ప్రజలను తప్పుదోవ పట్టించిందని పేర్కొంటూ అమెరికాలోని కాలిఫోర్నియా, కొలరాడో, కెంటకీ, న్యూజెర్సీ రాష్ట్రాల అటార్నీ జనరల్లు కోర్టును ఆశ్రయించారు. ఇందుకుగాను మెటా నుంచి 1.4 ట్రిలియన్ డాలర్ల పరిహారాన్ని (మన కరెన్సీలో ఏకంగా రూ.1.33 కోట్ల కోట్లు. ఇది మస్క్ మొత్తం ఆస్తి కన్నా ఎక్కువ) ఇప్పించాలని వారు కోరారు. ఈ కేసు ఆగస్టులో విచారణకు రానుంది. ఈ ఏడాది మార్చిలో న్యూమెక్సికో రాష్ట్రం ఇలాగే 'బాలల భద్రత' అనే అంశంపై మెటా మీద కోర్టులో కేసు వేస్తే.. కోర్టు రూ.3100 కోట్ల జరిమానా వేసింది.

# టీనేజ్ ప్రేమికులు పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపుతుంది?

## పోక్సో దుర్వినియోగంపై సుప్రీంకోర్టు ఆందోళన

## పరువు కోసం తల్లిదండ్రులు కేసులు పెడుతున్నారని వ్యాఖ్య



ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. టీనేజీ వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి టీనేజ్ ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైందా అనే ప్రశ్నను కూడా లేవనెత్తింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం - యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన సుమోటో కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు బెంచ్ 'ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, అమ్మాయి కలిసి వెళ్లిపోకుండా ప్రభుత్వం లేదా వ్యవస్థ ఎలా అడ్డుకోగలదు? పిల్లలపై జరిగే లైంగిక దాడులు, దోపిడీని అరికట్టేందుకే పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అనేది సులభంగా ముప్పునకు లేదా ప్రభావానికి లోనయ్యే వయసు.

ప్రయోగాలు చేసే సున్నితమైన దశ. అలాంటప్పుడు ప్రతి ప్రేమ వ్యవహారాన్ని పోక్సో కేసుగా ఎలా మారుస్తారు?' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 2023లో కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఒక వివాదాస్పద తీర్పులో యువతులు తమ లైంగిక కోరికల్ని నియంత్రించుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు 2024లో ఆ తీర్పును రద్దు చేసి, యుక్త వయస్కుల గోప్యత హక్కుల అంశంపై సుమోటో కేసు నమోదు చేసింది. ప్రస్తుతం అదే కేసు విచారణ కొనసాగుతోంది. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ ఈ కేసు నేపథ్యాన్ని వివరించారు. ఒక మైనర్ బాలిక 25 ఏళ్ల వ్యక్తితో స్వచ్ఛందంగా వెళ్లి ప్రస్తుతం అతనితో కలిసి జీవిస్తూ, వారికి ఒక బిడ్డ కూడా ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. పోక్సో చట్టం కారణంగా ఇలాంటి సంబంధాల్లో ఉన్న యువకులు జైలుకు




వెళ్లాల్సి వస్తోందని ఆమె వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం '16 నుంచి 18 ఏళ్ల మధ్య యువత ప్రేమలో పడి కలిసి వెళ్లిపోతారు. కుటుంబ పరువును కాపాడుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. చివరికి కోర్టులు వారిని నిర్దోషులుగా విడుదల చేయాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించింది. 2012లో పోక్సో చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత సమ్మతి వయసును 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు పెంచారని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. అయితే టీనేజీ ప్రేమ సంబంధాలు 2012 తర్వాత మాత్రమే మొదలయ్యాయని చెప్పలేమని, ఇలాంటి ఘటనలు గతంలో కూడా ఉండేవని పేర్కొంది. బాల్య వివాహాలు కూడా గతంలో సాధారణమేనని ధర్మాసనం గుర్తు చేసింది. అయితే చట్టం మారడంతో ఇప్పుడు అలాంటి సంబంధాలు నేర పరిధిలోకి వచ్చాయని వివరించింది. పోక్సో చట్టం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం అని మాధవి దివాన్ అభిప్రాయపడ్డారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రతి హైకోర్టులో ఇప్పటికే బాలల హక్కుల కమిటీలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ కేసుల్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం కూడా పోక్సో చట్టం అమలుకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు జులై 17కు


వాయిదా వేసింది.

## పోర్నోగ్రఫీ నియంత్రణపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

దేశవ్యాప్తంగా పోర్నోగ్రఫీ నియంత్రణకు ప్రత్యేక జాతీయ విధానం రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. మైనర్లను అశ్లీల కంటెంట్ ప్రభావం నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాతీయ పాలసీని తీసుకురావాలని పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసు విచారణ సందర్భంగా అశ్లీల కంటెంట్ నియంత్రణ, దానికి సంబంధించిన విధానాల రూపకల్పన వంటి అంశాలు కోర్టుల పరిధిలోకి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా ప్రభుత్వం, పార్లమెంట్, చట్టసభల అధికార పరిధిలోని అంశమని ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రయోజన అంశాలపై కోర్టులు అవసరమైన సందర్భాల్లో జోక్యం చేసుకోగలిగినప్పటికీ, కొత్త విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం న్యాయవ్యవస్థ బాధ్యత కాదని అభిప్రాయపడింది. విధాన నిర్ణయాల విషయంలో కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల అధికారాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

# పోక్సో కేసులు ఏడేళ్లలో రెట్టింపు

దేశవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న నేరాలు ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం... 2016 నుంచి 2023 మధ్య కాలంలో పోక్సో చట్టం కింద నమోదైన కేసులు దాదాపు రెట్టింపయ్యాయి. ఇదే సమయానికి పిల్లలపై జరిగిన మొత్తం నేరాలు 40శాతం పెరిగాయి. 2016లో 36,022గా ఉన్న పోక్సో కేసులు 2023 నాటికి 67,694కు పెరిగాయి. ఈ కాలంలో పోక్సో బాధితుల సంఖ్య కూడా 36,321 నుంచి 68,636కు పెరిగింది. 2016-23 మధ్య దేశంలో నమోదైన పిల్లలపై నేరాలకు సంబంధించి మొత్తం కేసుల్లో పోక్సో కేసులు, బాధితులు 30 శాతానికి పైమాటే. ఈ లెక్కలు మైనర్లపై పెరుగుతున్న లైంగిక హింస తీవ్రతకు అద్దం పడుతున్నాయి. పిల్లలపై జరిగిన మొత్తం నేరాలు 2016లో లక్ష మార్కును దాటగా, 2023 నాటికి 1.77 లక్షలకు చేరాయి. ఈ సమయానికి బాధితుల సంఖ్య కూడా 1.11 లక్ష నుంచి 1.86 లక్షలకు పెరిగింది. బాలికలపై అత్యాచార కేసుల్లో 2023లో మహారాష్ట్ర (4,672) మొదటిస్థానంలో ఉంది.




# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం

## ట్రైనీ మహిళా ఐపీఎస్ ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టు.. 14 రోజుల రిమాండ్

దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణ కేంద్రమైన హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల ఉదంతం తీవ్ర కలకలం రేపింది. అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణికి, తోటి ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కొంతకాలంగా అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ప్రవర్తనతో తీవ్ర ఇబ్బందికి గురైన సదరు మహిళా అధికారిణి చివరకు చట్టపరమైన చర్యల కోసం పోలీసులను ఆశ్రయించారు. ఈ వేధింపుల వ్యవహారంపై ఆమె అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్న ఉప్పరపల్లి పోలీసులు కోర్టులో

హాజరుపరచడంతో 14 రోజుల రిమాండ్ విధించింది. ఆగస్టు 11 వరకు ఆయనకు రిమాండ్ విధిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.  సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ఉదయ్‌ను పోలీసులు అశోక్‌నగర్ తీసుకెళ్లారు. ఆయన ఉంటున్న గదిని అత్తాపూర్ సీఐ సీతయ్య పరిశీలించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి అరెస్టుపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. “ఉదయ్‌కృష్ణారెడ్డి గతంలో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. యూపీఎస్సీ రాసి 2025 బ్యాచ్‌లో


ఉదయ్ కృష్ణారెడ్డి

ఐపీఎస్‌గా ఎంపికయ్యాడు. ఉదయ్‌కృష్ణారెడ్డి 2025 డిసెంబర్ నుంచి ఎన్‌పీఏ శిక్షణలో ఉన్నాడు. 2025 మధ్యలోనే ఉదయ్‌కు ఇన్‌స్టాలో బాధితురాలు పరిచయమైంది. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. పలుసార్లు ఆత్మహత్య చేసుకుంటానని నిందితుడు బెదిరించాడు. ఆయుధాలు చూపించి బాధితురాలిని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్‌టాప్ విసిరి ధ్వంసం చేశాడు. ఆమె బ్లాక్ చేశాక నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు అతడికి దూరంగా ఉంది. బాధితురాలు మరో వ్యక్తిని పెళ్లి చేసుకున్నా వేధించాడు. ఉదయ్ కృష్ణారెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు అని సీపీ సజ్జనర్ తెలిపారు. డీసీపీ లావణ్యనాయక్ జాదవ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న దర్యాప్తు చేపట్టారు. జాతీయ పోలీసు అకాడమీలో బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించగా మెడ, గొంతు నులిమినట్లు ఆనవాళ్లు చెంప భాగంలో కమిలిన గాయాలు, ఎడమ కాలిపై దెబ్బలున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

నిందితుడికి పోలీసులు నోటీసులిచ్చేందుకు హైదరాబాద్‌లోని రెండు చిరునామాల్లో ప్రయత్నించగా దొరకలేదు. దీంతో 4 బృందాలను ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఒంగోలులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు  అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి కర్ణాటకకు ప్రయాణమైనట్లు గుర్తించి మరో బృందం అక్కడకు వెళ్లింది. మరో రెండు బృందాలు సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మిర్యాలగూడ సమీపంలో ఉదయ్‌కృష్ణారెడ్డి ఉన్నట్లు గుర్తించారు. ఆయన

వాహనాన్ని పోలీసులు అనుసరిస్తూ హైదరాబాద్‌కు చేరగానే అదుపులోకి తీసుకున్నారు.

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ ప్రవర్తించిన తీరుపై బాధితురాలు ఫిర్యాదులో పలు ఆరోపణలు చేశారు. ఈ ఏడాది జూన్ 23వ తేదీ నుంచి ఉదయ్ తనను వేధించడం మొదలుపెట్టాడని ఆమె పేర్కొన్నారు. పదే పదే అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ మానసిక క్షోభకు గురిచేశాడని ఆరోపించారు. అంతటితో ఆగకుండా, వేరే వారితో తనకు వివాహేతర సంబంధం ఉందంటూ తప్పుడు ప్రచారం చేశాడని వాపోయారు. తన చేతిలో నుంచి బలవంతంగా మొబైల్ ఫోన్ లాక్కున్నాడని చెప్పారు. అందులోని వ్యక్తిగత మెసేజ్‌లు చూసి ఇబ్బందులకు గురిచేశాడని వివరించారు. తన వ్యక్తిగత వీడియోలను రహస్యంగా తీశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వీడియోలను తన భర్తకు పంపి, బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

ఈ కేసు వ్యవహారంలో ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి గతంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడు ఆస్పత్రిలో చేరడానికి ముందు ఓ లేఖ రాశారు. ఆ లేఖలో ట్రైనీ మహిళా ఐపీఎస్‌తో తనకు ఉన్న సంబంధం గురించి ఉదయ్ ప్రస్తావించాడు. ట్రైనీ ఐపీఎస్ బ్యాచ్‌మేట్‌తో తాను ఏడాదిగా సన్నిహితంగా ఉన్నట్లు అందులో పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని లేఖలో స్పష్టం చేశాడు. తనపై అత్తాపూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద నమోదు చేసిన కేసును రద్దు (క్వాష్) చేయాలంటూ ఉదయ్ కృష్ణారెడ్డి ఇటీవల కోర్టును ఆశ్రయించాడు.



# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

## కోర్టులకు, లాయర్లకు సుప్రీంకోర్టు హెచ్చరిక
## ఏఐ పేర్కొనే 'గత తీర్పు'లను ప్రస్తావించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచన

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై న్యాయమూర్తులు, న్యాయవాదులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏఐ పేర్కొనే 'గత తీర్పులను' ఉదహరించేముందు వాటిని కచ్చితంగా సరిచూసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏఐ సృష్టించే నకిలీ, ఊహాజనిత, ఉనికిలో లేని తీర్పులను ఎంతమాత్రం ఉపేక్షించవద్దని పేర్కొంది. ఈ మేరకు ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ కంపెనీ దివాలా కేసులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధెలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కేసుపై విచారణ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఏఐ సృష్టించే నకిలీ, ఊహాజనిత వివరాలను 'కోర్టులు ఇచ్చిన గత తీర్పులు'గా పేర్కొనటం అంటే న్యాయవ్యవస్థ మీదికి మిథైల్ ఐసోసైనేట్ (భోపాల్ ప్రమాదంలో వెలువడిన విషవాయువు)ను వదలటమే. అది న్యాయవ్యవస్థను కలుషితం చేయటమేకాదు, దాంట్లోని జీవాన్నే హరించివేస్తుంది' అని హెచ్చరించింది.

ఏఐ సృష్టించే 'గత తీర్పులను' ధ్రువీకరించుకోకుండా తీర్పుల్లోగానీ, వాదనల్లోగానీ ప్రస్తావించకూడదని, అటువంటి వాటి పట్ల ఎంతమాత్రం సహించని వైఖరిని కలిగి ఉండాలని కోర్టులకు, న్యాయవాదులకు సూచించింది. ఏఐ సృష్టించే నకిలీ, ఊహాజనిత వివరాలను ఉదాహరణగా పేర్కొంటూ ఇచ్చే తీర్పులు తీర్పులే కావని ప్రకటించింది. ఏఐ సృష్టించే నకిలీ తీర్పులపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం. ఏఐ సక్రమ వినియోగంపై సానుకూలత వ్యక్తం చేసింది. కాగా, ఎస్సెల్ ఇన్‌ఫ్రా దివాలా కేసులో తీర్పునిస్తూ.. ఆ నిర్ణయానికి మద్దతుగా ఎన్‌సీఎల్‌టీ ఉదహరించిన పలు 'గత తీర్పు లు' అసలు లేనే లేవని సుప్రీంకోర్టు గుర్తించింది.

# ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కారు

## ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించే హక్కు వారికి ఉంది
## నిరసన తెలపటం రాజ్యాంగం కల్పించిన హక్కు
## పౌరుల నగర బహిష్కరణ చెల్లదు: బాంబే హైకోర్టు
## పోలీసులు ముఖ్యమంత్రి, ప్రధానికి సేవకులు కాదని వ్యాఖ్య

"దేశ పౌరులను భారత ప్రభుత్వానికి బానిసలుగా మారుస్తున్నారా? వారు నిరసన ప్రదర్శనలు చేయకూడదా? నిరసిస్తే కేసులతో వేధిస్తారా? నిరసన వ్యక్తం చేయడం పౌరుల హక్కు. పిటిషనర్ కేవలం బీజేపీ ప్రభుత్వం డౌన్ డౌన్, అమిత్‌షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాంటి నినాదాలు ఇవ్వకూడదా? వాటికే సమాజం నుంచి వెలి వేస్తారా?" ఓ వ్యక్తి నగర బహిష్కరణ కేసులో విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇవి. మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతానికి చెందిన సమీద్ అహ్మద్ అబ్దుల్ వాహిద్ చౌదరి (49) సోషలిస్ట్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పౌరసత్వ సవరణ చట్టంతోపాటు జ్ఞానవాపి మసీదు వివాదం తదితర సున్నిత అంశాలకు వ్యతిరేకంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ఏడాది పాటు ఆయన్ని నగరం నుంచి బహిష్కరిస్తూ కొంకణ్ ప్రాంత డిప్యూటీ పోలీసు కమిషనర్ 2025 డిసెంబర్ 3న ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని డివిజనల్ పోలీసు కమిషనర్ కూడా 2026 మార్చి 27న సమర్థించారు. దీంతో వాహిద్ చౌదరి న్యాయం కోరుతూ బాంబే హైకోర్టు తలుపు తట్టారు. ఈ ఆదేశాలను జారీ చేసిన పోలీసులను జస్టిస్ మాధవ్ జామ్‌దార్ కడిగి పారేశారు. ప్రభుత్వ నిర్ణయాలను విభేదించినందుకు పౌరులను బహిష్కరించే హక్కు పోలీసులకు లేదని తేల్చి చెప్పారు. పోలీసులు ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి సేవకులు కాదని, వారు ప్రజా సేవకులని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో ప్రస్తుతం రాజకీయ బేరసారాలు నడుస్తున్నాయంటూ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలను మారుస్తుంటే వారిపై ఏమైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారా? అని పోలీసులను

నిలదీశారు. పౌరులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడమే కాకుండా, గౌరవంగా జీవించే హక్కుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 హామీ ఇస్తున్నాయని స్పష్టం చేస్తూ వాహిద్ చౌదరిపై బహిష్కరణ ఆదేశాలను న్యాయమూర్తి కొట్టివేశారు.

# భర్త కంటే ఎక్కువ సంపాదించే భార్యకు 'తాత్కాలిక భరణం' హక్కు లేదు

## కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు

ఓ భార్యాభర్తల వివాదం కేసు విషయంలో కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటూ, భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్న భార్యకు 'తాత్కాలిక భరణం' పొందే హక్కు లేదని స్పష్టం చేసింది. భార్యకు నెలకు రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులకు 2024లో వివాహం అయ్యింది. కానీ వైవాహిక విభేదాల కారణంగా కొన్ని నెలల తర్వాత విడివిడిగా జీవించడం ప్రారంభించారు. ఆ తర్వాత భార్య భరణం కోరుతూ దిగువ కోర్టును ఆశ్రయించింది. విచారణ సమయంలో, భర్త నెలవారీ జీతం రూ.60,646కాగా, భార్య నెలకు రూ.1 లక్ష సంపాదిస్తున్నట్లు తేలింది. అయినప్పటికీ భర్త ప్రతి నెలా రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలని దిగువ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాన్ని సవాల్ చేస్తూ భర్త కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ చిల్లాకూర్ సుమలత అనుమతించారు. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్త ఎల్లప్పుడూ భార్యకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలనే లింగ-ఆధారిత అంచనాలు ఆధారంగా తీర్పులు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. ముఖ్యంగా భార్య ఆర్థికంగా సురక్షితంగా ఉండి, ఎలాంటి సాయం అవసరం లేనప్పుడు తాత్కాలిక భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇలాంటి ప్రతి కేసుకు సంబంధించి పూర్తి వాస్తవాలు, పరిస్థితులను నిశితంగా పరిశీలించిన తర్వాతే భరణంకు సంబంధించిన ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టు తేల్చిచెప్పింది.

భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉండి, భర్త కంటే ఎక్కువ సంపాదిస్తూ, పిల్లల సంరక్షణ లాంటి అదనపు బాధ్యతలు లేనప్పుడు భరణం ఇవ్వాల్సిన అవసరం ఏముంది? భార్యను పోషించడం భర్త బాధ్యత అనే భావనతో మాత్రమే భరణం చెల్లించాలని కోర్టులు

ఆదేశించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భర్త ఎల్లప్పుడూ భార్యను పోషించాలనే సంప్రదాయ భావనలకు లోనుకావద్దని ఫ్యామిలీ కోర్టుకు సూచించింది. భార్య- తనను తాను పోషించుకోవడానికి అవకాశం లేదని, స్వతంత్ర ఆర్థిక వనరులు లేవని నిరూపించుకున్నప్పుడు మాత్రమే తాత్కాలిక భరణాన్ని లేదా తుది భరణాన్ని మంజూరు చేయాలని హైకోర్టు పేర్కొంది.

"ప్రస్తుత కేసులో భార్య నెలవారీ ఆదాయం ఒక లక్ష రూపాయలు. అది ఆమే స్వయంగా అంగీకరించింది. ఇది ఆమె భర్త నెలవారీ జీతం కంటే ఎక్కువ. దీనిని బట్టి భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉంది. కాబట్టి తనను తాను పోషించుకోగలదు. నెలకు సుమారు రూ.60వేలు జీతం వచ్చే భర్తను, ప్రతినెలా రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలని దిగువ కోర్టు ఆదేశించడం సరికాదు. అలాంటి ఆదేశం చట్టబద్ధంగా చెల్లదు" అని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ తీర్పు కేవలం 'తాత్కాలిక భరణం' అంశానికి మాత్రమే పరిమితమని, పెళ్లి వివాదానికి సంబంధించిన తుది తీర్పుపైగానీ, భరణంపై తీసుకునే తుది నిర్ణయంపై గానీ దీని ప్రభావం ఉండదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. కాగా ఈ కేసులో, భార్య ఆర్థికంగా స్వయంసమృద్ధిగా ఉంది, పైగా భర్త కంటే చాలా ఎక్కువ సంపాదిస్తున్నది కాబట్టి, తాత్కాలిక భరణాన్ని మంజూరు చేయలేమని పేర్కొంటూ దిగువ కోర్టు ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది.

# నిఖా హలాలా ముసుగులో మహిళలపై లైంగిక వేధింపులను సహించలేం

## నేరాలకు మతపరమైన చట్టాలు రక్షణ కల్పించలేవు అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

నిఖా హలాలా, ట్రిపుల్ తలాఖ్ పేరుతో మహిళలపై లైంగిక వేధింపులను సహించలేమని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి నేరపూరిత చర్యలకు మతపరమైన చట్టాల ముసుగులో రక్షణ లభించదని కీలక వ్యాఖ్యలు చేసింది. బాల్య వివాహం, ట్రిపుల్ తలాఖ్, నిఖా హలాలా, పునర్వివాహం పేరుతో తనపై భర్త, ఓ మౌలానా, బంధువులు సహా తొమ్మిది మంది పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ యూపీకి చెందిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని, అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలంటూ నిందితులు అలహాబాద్ హైకోర్టును

ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనా ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం నిందితుల అభ్యర్థనను తిరస్కరించింది. ఎఫ్ఐఆర్‌లో నిందితులపై తీవ్రమైన నేరారోపణలున్నాయని, వాటిలో ప్రాథమిక ఆధారాలు కనిపిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ట్రిపుల్ తలాఖ్ ఆచారం ప్రకారం భర్త మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా భార్యకు విడాకులివ్వొచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వం 2019లో ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తూ చట్టం చేసింది. నిఖా హలాలా అంటే.. విడాకులిచ్చిన మహిళను ఆమె మాజీ భర్తే మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనుకుంటే ఆలోపు ఆమెకు మరో వ్యక్తితో పెళ్లి జరిపించాలి. ఆ వ్యక్తితో ఆమె సన్నిహితంగా గడపాలి. అనంతరం అతను స్వచ్ఛందంగా ఆమెకు విడాకులివ్వాలి. ఆ తర్వాతే మొదటి భర్త, ఆమెను మళ్లీ పెళ్లి చేసుకోవొచ్చు. నిఖాహలాల్‌ను అడ్డుపెట్టుకొని భర్త, అతడి సోదరుడు, బంధువులు, ఓ మతపెద్ద లైంగిక వేధింపులకు ఒడిగట్టారని ఫిర్యాదులో బాధితురాలు ఆరోపించింది. కాగా ఈ కేసుకు సంబంధించి ట్రిపుల్ తలాక్, నిఖా హలాల్ అనే ఆచారాలు సమాజంలోని చీకటి అధ్యాయాలుగా కనిపిస్తున్నాయని, మహిళలపై వేధింపులు సమాజాన్ని తలదించుకునేలా చేశాయని ధర్మాసనం పేర్కొంది. ఎఫ్ఐఆర్ రద్దు చేయడానికి సరైన కారణాలు కనిపించడం లేదని తీర్పు వెలువరించింది.

ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం బాధిత యువతిది అంబాలా జిల్లా. 2015 ఏప్రిల్‌లో 15ఏళ్ల ప్రాయంలో ఆమెకు బాల్య వివాహం జరిగింది. అజహర్ నవాజ్ అనే వ్యక్తి ఆమెను పెళ్లిచేసుకున్నాడు. 2016 జనవరిలో ఆమెకు మూడుసార్లు తలాక్ చెప్పి వదిలించుకున్నాడు. ఆ తర్వాత ఆమెనే మళ్లీ పెళ్లి చేసుకోవాలనే సాకుతో 2017లో బాధితురాలిని బలవంతంగా మౌలానా ఖయ్యూమ్ అనే ఓ మతపెద్దకు ఇచ్చి పెళ్లి జరిపించాడు. ఆ తర్వాత బాధితురాలిని అజహర్ మళ్లీ పెళ్లి చేసుకొని 2021లో తలాక్ చెప్పేసి, కొన్నాళ్లకు రాజీకొచ్చాడు. ఈ సమయంలో అజహర్ సోదరుడు షానవాజ్, మరో బంధువు హకీం నిషాత్ రంగప్రవేశం చేసి బాధితురాలితో మాట్లాడారు. అజహర్‌తో మళ్లీ పెళ్లి జరిగేందుకు షరతులు పెట్టారు. అప్పటికే రెండుసార్లు విడాకులైందని, ఫలితంగా నిఖా హలాల్ కూడా రెండుసార్లు జరగాలని ఆమెను భయపెట్టారు. 2025 ఫిబ్రవరిలో నిఖా హలాల్ తంతుపేరిట ఆమెపై షానవాజ్, హకీం అత్యాచారం జరిపారు. అనంతరం అజహర్‌తో వైవాహిక సంబంధం కొనసాగించేందుకు ఆమెకు నకిలీ వివాహం జరిపించారు. కాగా మొదటి నిఖా హలాల్ సమయంలోనే ఆమె మైనర్ (17ఏళ్లు) అని కోర్టు తీర్పులో గుర్తుచేయడం గమనార్హం.

# హిందూ మత స్వీకరణకు సర్టిఫికెట్లు అవసరం లేదు

## మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని మద్రాస్ హైకోర్టు తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది.

# హిందూ వివాహంలో రిజిస్ట్రేషన్ సరిపోదు, ఆచారాలు అవసరం

## గుజరాత్ హైకోర్టు

హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతపై గుజరాత్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. హిందూ సంప్రదాయాల ప్రకారం 'సప్తపది' (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు, ఆచారాలు నిర్వహించకుండా కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహం అనేది కేవలం 'పాటలు, డ్యాన్స్‌లు, విందు వినోదాల' కోసం జరుపుకునే వేడుక కాదని కోర్టు వ్యాఖ్యానించింది. భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాలు ఉన్నప్పటికీ, ఈ సంప్రదాయ వేడుకలు ఒక వ్యక్తి ఆధ్యాత్మికతను శుద్ధి చేసి, పరివర్తన చెందిస్తాయని నమ్ముతారని హైకోర్టు జూన్ 23 నాటి ఉత్తర్వులో పేర్కొంది. ఒక జంట మధ్య జరిగిన వివాహాన్ని చెల్లనిదిగా ప్రకటించడానికి నిరాకరించిన

ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ, యూకేలో నివసిస్తున్న ఒక వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌పై ఈ తీర్పు వెలువడింది. గతేడాది నవంబర్‌లో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేస్తూ, జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్.టి. వాచ్ఛానిలతో కూడిన డివిజన్ బెంచ్, సప్తపది వంటి ఆవశ్యకమైన వేడుకలను నిర్వహించడమే హిందూ వివాహానికి పునాది అని తన ఉత్తర్వులో పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రతిని అందుబాటులోకి తెచ్చారు. సప్తపది వంటి వేడుకలు.. అంటే వధూవరులు పవిత్రమైన అగ్ని ముందు కలిసి ఏడు అడుగులు వేయడం వివాహానికి పవిత్రమైన సంస్కారంగా ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తాయని కోర్టు పేర్కొంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తికి, అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళకు పెళ్లయినట్లు ఒక రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ వెలుగులోకి వచ్చింది. అయితే, సదరు మహిళ తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి మ్యారేజ్ సర్టిఫికేట్ చూపించే వరకు తనకు ఆ పెళ్లి గురించి తెలియదని, తన సంతకాన్ని ఫోర్జరీ లేదా మోసపూరితంగా సేకరించారని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. తమ మధ్య ఎలాంటి హిందూ సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని, భార్యాభర్తలుగా కలిసి ఉండలేదని స్పష్టం చేశాడు. ఈ వివాహం చెల్లదంటూ కౌశల్ దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో ఫ్యామిలీ కోర్టు కొట్టివేయగా, ఆయన హైకోర్టులో అప్పీల్ చేశారు. విచారణలో.. తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని సదరు మహిళ కూడా అంగీకరించింది. దీంతో ఫ్యామిలీ కోర్టు తీర్పును తప్పుబడుతూ హైకోర్టు ఆ వివాహాన్ని రద్దు చేసింది.

### కుమార్తెపై అత్యాచారమా?!

# ఇంతకంటే నీచమైన నేరం ఉంటుందా?

## గర్భానికి కారకుడైన కన్నతండ్రి జీవిత ఖైదు సరైన శిక్ష: బాంబే హైకోర్టు

కన్న తండ్రే తన కుమార్తెపై లైంగిక దాడి చేయడం కంటే దిగ్భ్రాంతికరమైన, హేయమైన

నేరం మరొకటి ఉండదని బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడైన తండ్రికి కింది కోర్టు విధించిన జీవిత ఖైదును హైకోర్టు సమర్థించింది. శిక్షను సవాల్ చేస్తూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. మహారాష్ట్రకు చెందిన 43 ఏళ్ల వ్యక్తి, తన 12 ఏళ్ల కుమార్తెపైనే అత్యాచారానికి పాల్పడి ఆమె గర్భం దాల్చడానికి కారణమయ్యాడు. ఈ దారుణ ఘటనపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధరించి 2021లో జీవిత ఖైదు విధించింది. అయితే, తాను తిడుతున్నాననే కోపంతోనే కుమార్తె తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపిస్తూ, నిందితుడు బాంబే హైకోర్టు నాగ్‌పుర్ బెంచ్‌ను ఆశ్రయించాడు. దీనిపై విచారించిన న్యాయస్థానం, నిందితుడి వాదనను తీవ్రంగా తప్పుబడుతూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో తన తండ్రి ప్రమేయం ఉండటంతో బాధితురాలు మానసిక క్షోభకు గురైందని, ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయిందని పేర్కొంది. “ఒక బిడ్డకు తన తండ్రిపై ఉండే నమ్మకాన్నే నిందితుడు వమ్ము చేశాడు. తన బిడ్డకు రక్షకుడిగా ఉండాల్సిన అతడే స్వయంగా తన కూతురి జీవితాన్ని నాశనం చేశాడు. అత్యాచారం అనేది కేవలం శారీరక దాడి మాత్రమే కాదు, అది బాధితురాలి వ్యక్తిత్వాన్ని కూడా పూర్తిగా దెబ్బతీస్తుంది” అని హైకోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఇంతటి దారుణమైన ఘటన 2021లో వెలుగులోకి వచ్చింది. బాలిక ఉంటున్న గ్రామానికి ఓ ఆశా కార్యకర్త సర్వే కోసం వెళ్లారు. ఆ సమయంలో బాలిక మాససిక పరిస్థితి సరిగ్గాలేకపోవడాన్ని గమనించాడు. దీంతో ఆమె వైద్య పరీక్షలు చేయగా, గర్భవతి అని తేలింది. దీంతో ఆ ఆశాకార్యకర్త పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే, విచారణలో బాలికపై ఆమె తండ్రే కొన్నేళ్లుగా అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. తల్లి చనిపోవడంతో ఆమె ఈ విషయం ఎవరికీ చెప్పలేదని తెలిసింది. విచారణ జరుగుతుండగానే ఆ బాలిక చిన్నారికి జన్మనిచ్చిందని, ఆ శిశువుకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించగా బాలిక తండ్రి నమూనాతో సరిపోలిందని తెలిసింది. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అంతకుముందు తమిళనాడులో ఇలాంటి ఘటనే ఒకటి జరిగింది. కుమార్తెపై ఐదేళ్లుగా కన్నతండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పుదుచ్చేరి వానరపేట్టై ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. వీరికి 14, 8 వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, భార్య పనికి వెళ్లగానే భర్త తన 14ఏళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడుతూ వచ్చాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడు తండ్రి.

అనంతరం ఇంటికొచ్చిన తల్లి కుమార్తె నీరసంగా ఉండడం గమనించి ఆమెను ఏం జరిగిందో అడిగి తెలుసుకుంది. అసలు విషయం కుమార్తె చెప్పడంతో భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టం కిందట అతన్ని అరెస్ట్ చేశారు. ఐదేళ్లుగా అతను కుమార్తెను బెదిరించి అఘాయిత్యానికి పాల్పడుతూ వచ్చాడని, ఎనిమిదేళ్ల కుమార్తెను కూడా లైంగిక వేధింపులకు గురిచేసినట్లు దర్యాప్తులో బయటపడింది.

# దాంపత్య వివాదాన్ని భర్త ఉద్యోగ యజమానికి ఫిర్యాదు చేయొద్దు

## భర్త ఉద్యోగంపైనా, భార్య భరణంపైనా ప్రభావం అది సరైన పద్ధతి కాదన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

దాంపత్య వివాదాన్ని భర్త పనిచేస్తున్న సంస్థకు లేదా యజమానికి భార్య ఫిర్యాదు చేయడం సరైన పద్ధతి కాదని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇలాంటి చర్యలతో భర్త ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, భార్య భరణం (మెయింటెనెన్స్)పైనా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అసోంలో తనపై నమోదైన పరువునష్టం దావాను ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఓ మహిళ దాఖలు చేసిన బదిలీ పిటిషన్‌ను విచారించే సందర్భంగా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఘజియాబాద్‌లో మహిళకు తన భర్తతో పలు న్యాయ వివాదాలు కొనసాగుతున్నాయని సుప్రీంకోర్టుకు మహిళ తరపు న్యాయవాది తెలిపారు. అదే సమయంలో భర్త స్నేహితుడు ఆమెపై అస్సాంలో పరువునష్టం కేసు దాఖలు చేశాడని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసును ఘజియాబాద్‌కు బదిలీ చేయాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ.. ఇటీవల చాలా మంది మహిళలు దాంపత్య కలహాలతో భర్తల యజమానులకు ఫిర్యాదులు చేస్తున్నారని, దీంతో వారు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జీవిత భాగస్వామి జీవనోపాధిని దెబ్బతీయడం తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించారు. భర్త ఉద్యోగం కోల్పోతే

భార్య భవిష్యత్తులో భరణం కోరేందుకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కేసులో ఢిల్లీలోని వైమానిక దళ అధికారులకు మహిళ ఫిర్యాదు చేస్తూ తన భర్త ఎయిర్‌ఫోర్స్ అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యాపారం చేస్తున్నారని మహిళ ఆరోపించింది. దీనిపైనే పరువునష్టం కేసు నమోదైంది. అయితే, భార్య, ఆమె సోదరుడిపై ఎయిర్‌ఫోర్స్ హెల్మెట్ చోరీ చేశారంటూ భర్త తప్పుడు ఫిర్యాదు చేశారని, ఆ హెల్మెట్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికే అధికారులకు ఆమె వినతిపత్రం ఇచ్చిందని మహిళ తరఫు న్యాయవాది వాదించారు. అంతేకాకుండా, పరువునష్టం కేసును భర్త కాకుండా ఆయన స్నేహితుడు దాఖలు చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల మధ్య రాజీ అవకాశాలను పరిశీలించేందుకు ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రానికి ధర్మాసనం పంపించింది. అన్ని వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకుని, పరస్పరం చేసుకున్న ఆరోపణలను ఉపసంహరించుకునేలా మహిళకు సూచించాలని న్యాయవాదికి జస్టిస్ నాగరత్న చెప్పారు.

# దివ్యాంగులను కించపరిచిన యూట్యూబర్లకు 3 లక్షల చొప్పున ఫైన్

## ఎస్సీ ఎస్టీ తరహాలో కఠినమైన చట్టం తేవాలని కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచన

దివ్యాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయటమేగాక, తమ ఆదేశాలను పాటించనందుకు కమెడియన్ సమయ్ రైనా, యూట్యూబర్లు రణ్‌వీర్ అలహాబాదియా, ఆశిష్ చంచలానిలపై సుప్రీంకోర్టు రూ.3 లక్షల చొప్పున జరిమానా విధించింది. 'ఇండియా గాట్ టాలెంట్' పేరుతో నిర్వహించే ఓ షోలో సమయ్‌రైనా.. 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ' (ఎస్ఎంఏ) అనే వ్యాధి చికిత్సకు అయ్యే భారీ వ్యయంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఎస్ఎంఏతో బాధపడే ఓ వ్యక్తిని అపహాస్యం చేశారని సుప్రీంకోర్టులో గతంలో ఓ వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఇకపై ప్రతీ నెలలో రెండుసార్లయినా తమ షోలలో దివ్యాంగులు ముఖ్యంగా ఎస్ఎంఏ బాధితుల విజయగాథలను పరిచయం చేయాలని, ఆ షోల ద్వారా వచ్చే డబ్బును ఎస్ఎంఏ బాధితుల చికిత్సకు అందించాలని ఆదేశించింది. దివ్యాంగులను కించపరిచినందుకు బేషరతు క్షమాపణ చెబుతున్నట్లుగా షోలలో ప్రకటించాలని పేర్కొంది. ఈ ఆదేశాలను సమయ్ రైనాతోపాటు ఇతర

యూట్యూబర్లు పాటించలేదని పిటిషనర్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురాగా.. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఆదేశాలు పాటిస్తామంటూ తమకు ఇచ్చిన హామీని ఉల్లంఘించారని, ఇది అహంకారం తప్ప మరొకటి కాదని సీజేఐ పేర్కొన్నారు. కాగా, దివ్యాంగుల గౌరవాన్ని పరిరక్షించటం కోసం ఎస్సీ, ఎస్టీ చట్టం తరహాలో కఠినమైన చట్టం తీసుకొచ్చే అంశంపై యోచించాలని ధర్మాసనం కేంద్రప్రభుత్వానికి సూచించింది.

# 25శాతం భరణం తప్పనిసరి కాదు

## మార్గదర్శకం మాత్రమేనన్న అలహాబాద్ హైకోర్టు



భర్త నికర ఆదాయంలో 25 శాతం మొత్తాన్ని భార్యకు భరణంగా ఇవ్వాలన్నది కచ్చితమైన నిబంధన కాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రతి కుటుంబ వివాదం పరిస్థితులు, ఇరు పక్షాల ఆర్థిక స్థితి, అవసరాలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన తర్వాతే భరణం మొత్తాన్ని నిర్ణయించాలని పేర్కొంది. అందువల్ల అవసరాన్ని బట్టి 25 శాతం కంటే తక్కువైనా, ఎక్కువైనా భరణం నిర్ణయించే స్వేచ్ఛ కోర్టులకు ఉందని వెల్లడించింది.

కాన్పూర్ దేహాత్‌కు చెందిన విడాకులు పొందిన మహిళ పింకీ అలియాస్ ప్రీతి, కుటుంబ న్యాయస్థానం తనకు నెలకు మంజూరు చేసిన రూ.12 వేల భరణాన్ని పెంచాలని హైకోర్టును ఆశ్రయించింది. అదే సమయంలో తన మాజీ భర్త జై ప్రకాశ్, ఆ భరణం ఉత్తర్వును రద్దు చేయాలని మరో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను కలిపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అచల్ సచ్‌దేవ్ విచారించారు. ఈ సందర్భంగా మరో కీలక అంశాన్ని స్పష్టం చేశారు. భరణం లెక్కించే సమయంలో గ్రాస్ శాలరీ కాకుండా, పన్నులు, తప్పనిసరి కోతలు మినహాయించిన తర్వాత మిగిలే నికర ఆదాయాన్ని నెట్ ఇన్‌కమ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. వాస్తవంగా కుటుంబ నిర్వహణకు అందుబాటులో ఉండే ఆదాయం ఇదేనని వ్యాఖ్యానించారు. భరణం నిర్ణయించే సమయంలో ఒకే సూత్రాన్ని అన్ని కేసులకు వర్తింపజేయలేమని తెలిపారు.

అయితే వివాహ బంధం విడిపోయిందనే ఒక్క కారణంతో చట్టబద్ధమైన భార్యకు

భరణం హక్కు పోదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆమెకు స్వంత ఆదాయం లేకపోవడం, తిరిగి వివాహం చేసుకోకపోవడం, వ్యభిచార జీవితం గడపకపోవడం వంటి పరిస్థితుల్లో భరణం పొందే హక్కు కొనసాగుతుందని తెలిపింది. భరణం అంటే కేవలం జీవనం సాగించేందుకు కనీస సహాయం మాత్రమే కాదని, మహిళ గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన ఆర్థిక భరోసా కల్పించడమే దాని ప్రధాన ఉద్దేశమని కోర్టు వ్యాఖ్యానించింది.

విచారణలో భర్తకు నెలకు రూ.86,674 స్థూల వేతనం ఉండగా, తప్పనిసరి కోతల అనంతరం రూ.67,043 బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నట్లు కోర్టు గుర్తించింది. మరోవైపు భార్యకు స్వంతంగా ఎలాంటి ఆదాయ వనరు లేదని కూడా నమోదైంది. అయితే కుటుంబ న్యాయస్థానం భర్త వాస్తవ ఆదాయం, ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితులు, కేసులో సమర్పించిన పత్రాధారాలను సమగ్రంగా పరిశీలించకుండా భరణం నిర్ణయించిందని హైకోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, భరణం కేసుల్లో భర్త తన ఆస్తులు, అప్పులు, ఆదాయం తదితర వివరాలతో అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఈ కేసులో భర్త అలాంటి అఫిడవిట్ దాఖలు చేయలేదని హైకోర్టు పేర్కొంది. ఈ అంశం కూడా భరణం నిర్ణయంలో కీలకమని వివరించింది.

సాధారణంగా రివిజన్ పిటిషన్ విచారణలో భరణం మొత్తాన్ని మార్చడం అరుదేనని హైకోర్టు పేర్కొంది. అయితే దిగువ కోర్టు కీలక ఆధారాలను పట్టించుకోకుండా నిర్ణయం తీసుకుంటే జోక్యం చేసుకునే అధికారం హైకోర్టుకు ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కుటుంబ న్యాయస్థానం నిర్ణయించిన భరణం మొత్తంపై ఉన్న అభిప్రాయాన్ని రద్దు చేసి, నెలకు రూ.12 వేల స్థానంలో రూ.20 వేల భరణం చెల్లించాలని ఆదేశించింది. ఈ పెరిగిన భరణం మహిళ మొదట దాఖలు చేసిన దరఖాస్తు తేదీ నుంచే అమల్లోకి వస్తుందని జులై 10న ఇచ్చిన తీర్పులో హైకోర్టు పేర్కొంది. భర్త నికర ఆదాయంలో 25 శాతం భరణంగా నిర్ణయించాలన్న అంశంపై గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను కూడా హైకోర్టు ప్రస్తావించింది. ఆ శాతం అనేది ప్రతి కేసుకు వర్తించే కఠిన నిబంధన కాదని మరోసారి స్పష్టం చేసింది.

# కోర్టు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు: సుప్రీం కోర్టు

కోర్టుల్లో విచారణలకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో ఇష్టారీతిన షేర్ చేయడంపై సర్వోన్నత న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇకపై కోర్టు

అనుమతి లేకుండా ఈ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్ అనుమతులు, లేదా సుప్రీం కోర్టు సెక్రటరీ జనరల్ అనుమతి తీసుకున్నాకే వీటిని డిజిటల్ వేదికల్లో షేర్ లేదా మోనెటైజేషన్‌కు పెట్టుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. న్యూస్ రిపోర్టింగ్‌కు మాత్రం ఈ నిబంధన వర్తించదని వివరణ ఇచ్చింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో ఇష్టారీతిన షేర్ చేస్తున్నారంటూ ఓ జర్నలిస్టు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వీ మోహనల ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియాలో ఇష్టారీతిన షేర్ చేస్తున్న కోర్టు వీడియోల కారణంగా న్యాయస్థానాల గౌరవ మర్యాదలకు భంగం కలిగే అవకాశం ఉందని పిటిషనర్ అన్నారు. కొన్ని రోజుల క్రితం న్యాయస్థానంలో ఒక లాయర్ తన చేతిలోని కాగితాలను గాల్లోకి విసరిన వీడియోలు వైరల్‌గా మారాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారమంతా ఒక జోక్‌గా మారిందని విచారం వ్యక్తం చేశారు. లైవ్ స్ట్రీమింగ్‌తో పాటు ఇతర వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంపై ఆంక్షలు విధించాలని కోరారు. ఈ అభ్యర్థనపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ.. కోర్టులు 24 గంటలు నడిచే ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్స్ కావని వ్యాఖ్యానించారు. కోర్టు విచారణల లైవ్ స్ట్రీమింగ్‌లపై కూడా పరిమితులు ఉండాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లు, లైవ్ స్ట్రీమింగ్‌లకు సంబంధించి లింక్‌లను కూడా ఇష్టారీతిన షేర్ చేస్తున్నారని, వీటిపై కూడా పరిమితులు ఉండాలని జస్టిస్ బాగ్చీ అన్నారు. ఇందుకు సంబంధించి మెటా, ఎక్స్, ఇతర సోషల్ మీడియా వేదికలకు కూడా సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.

# నేటి తరానికి ఓపిక తక్కువ

## హనీమూన్ మర్డర్ కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్య


సమాజం అనేక మార్పులకు లోనవుతున్న కారణంగా హనీమూన్ మర్డర్ లాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయని సుప్రీం కోర్టు తాజాగా వ్యాఖ్యానించింది. హనీమూన్ సందర్భంగా రాజా రఘువంశీ హత్యకు గురైన కేసులో ఆయన భార్య సోనమ్ రఘువంశీ బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో జస్టిస్ ఎం. ఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం సోనమ్ బెయిల్‌ను రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'మారుతున్న సమాజంలో ఇలాంటి కేసులు

వెలుగుచూస్తున్నాయి. నేటి తరానికి ఓపిక తక్కువ. సమస్యలకు తక్షణ పరిష్కారాలు కావాలని వారు కోరుకుంటున్నారు. వ్యక్తిగత చట్టాలకు సంబంధించిన పలు కేసులు భవిష్యత్తులో కోర్టుల ముందుకు వస్తాయి' అని జస్టిస్ సుందరేశ్ అన్నారు. ఇక ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రస్తుత తరానికి అధిక సమాచారం అందుబాటులో ఉందని అన్నారు. కానీ జ్ఞానం మాత్రం లేదని వ్యాఖ్యానించారు. వాట్సాప్‌లో షేర్ చేస్తున్న సమాచారమే జ్ఞానంగా చెలామణీ అవుతోందని జస్టిస్ వరాలె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'హనీమూన్‌కు వెళ్లే భర్త తన వెంట బాడీగార్డులను కూడా తీసుకెళ్లినట్టు చెప్పే కామెడీ రీల్స్ వస్తున్నాయి. భార్యాభర్తల మధ్య ఒకప్పుడున్న విశ్వాసం క్రమంగా తగ్గిపోతోంది. గతంలో ఇలాంటి సందర్భాల్లో ఉమ్మడి కుటుంబాలు భార్యాభర్తల సమస్యలను మెరుగ్గా పరిష్కరించేవి' అని సొలిసిటర్ జనరల్ మెహతా చెప్పారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు ఉమ్మడి కుటుంబంలోని వారైతే అసంతృప్తిని ఎదుర్కోవడం, సర్దుకుపోవడం అలవాటు అవుతుంది. చిన్న కుటుంబాల్లోని వారు ఏదైనా తక్కువైతే మారాం చేస్తారు' అని వ్యాఖ్యానించింది. చిన్న కుటుంబాల కారణంగా జనాల్లో డిప్రెషన్ పెరుగుతోందన్న నివేదికలు కూడా ఉన్నాయని మెహతా చెప్పారు.

---

# ఢిల్లీ పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణా రహితంగా బలప్రయోగానికి పాల్పడిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై మితిమీరిన బలాన్ని ప్రయోగించడం ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ఈ నెల 20న కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటోగా స్పందించి.. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు ఈ నెల 25న నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది.



# లింగ సమానత్వానికి వార్షిక లోటే అడ్డు

## తక్షణం నిధులు కేటాయించాలని యుఎన్ ఉమెన్ పిలుపు

దీర్ఘకాలిక నిధుల కొరత, బలహీనమైన పర్యవేక్షణ వ్యవస్థలు మరియు అన్యాయమైన ఆర్థిక నిబంధనలు లింగ సమానత్వంలో పురోగతిని నిలిపివేస్తున్నాయి. ఈ అంతరాన్ని పూడ్చడానికి మరియు సమానత్వ కట్టుబాట్లను నెరవేర్చడానికి తక్షణ, నిరంతర పెట్టుబడులు పెట్టాలని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం పిలుపునిచ్చింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కింద లింగ సమానత్వాన్ని సాధించడానికి అవసరమైన నిధుల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏటా సుమారు 420 బిలియన్ డాలర్ల లోటులో ఉన్నాయి. స్పెయిన్‌లోని సెవిల్లాలో జరిగిన నాల్గవ అంతర్జాతీయ అభివృద్ధి ఫైనాన్సింగ్ సదస్సులో, సమ్మిళిత మరియు సుస్థిర అభివృద్ధికి సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించే ‘కాంప్రామిసో డి సెవిల్లా’ను ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం స్వాగతించింది. క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులు ఉన్నప్పటికీ, ఫైనాన్సింగ్ వ్యూహాలలో లింగ సమానత్వం యొక్క కీలక పాత్రను గుర్తించడంలో ఈ ఒప్పందం ఒక ముందడుగును సూచిస్తుంది. సుస్థిర అభివృద్ధికి మరియు బలమైన, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థలకు అత్యవసరమైనదిగా ఇప్పుడు విస్తృతంగా గుర్తించబడిన లింగ సమానత్వానికి నిధులు సమకూర్చడంలో శాశ్వతమైన ఊపును సృష్టించడానికి ఈ సదస్సు ఒక కీలకమైన అవకాశం. లింగ అంతరాలను పూడ్చడానికి, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, మరియు ఎవరూ వెనుకబడకుండా చూసుకోవడానికి, రాబోయే పదేళ్లపాటు స్థిరమైన మరియు లక్షిత పెట్టుబడులు అవసరం.

ప్రభుత్వాలు మరియు ఆర్థిక సంస్థలు కేవలం వాగ్దానాలకే పరిమితం కాకుండా, అత్యంత అవసరంలో ఉన్న మహిళలు మరియు బాలికలకు ప్రయోజనం చేకూర్చే స్పష్టమైన, నిరంతర పెట్టుబడుల వైపు పయనించాలని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం కోరుతోంది. ప్రస్తుత అంతరం, మహిళల హక్కులు మరియు సేవలకు నిధుల కొరత తీవ్రంగా మరియు దీర్ఘకాలంగా ఉందని స్పష్టం చేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వాలు మరియు ఆర్థిక సంస్థలు వనరులను పునఃకేటాయించాల్సిన తక్షణ అవసరాన్ని ఇది సూచిస్తోంది. అత్యధిక సంఖ్యలో అల్ప ఆదాయ మహిళలు నివసిస్తున్న మరియు పెట్టుబడులు అత్యవసరంగా అవసరమైన పేద దేశాలను, చాలా ప్రపంచ ఆర్థిక సహాయం విస్మరిస్తూనే ఉంది. ఈ డబ్బు అత్యంత అవసరమైన మహిళలు మరియు బాలికలకు చేరడం లేదు. లింగ-ప్రతిస్పందన బడ్జెట్ వినియోగం పెరుగుతున్నప్పటికీ, ప్రజా నిధులను లింగ సమానత్వానికి ఎలా కేటాయిస్తున్నారో పర్యవేక్షించే వ్యవస్థలు ప్రతి నాలుగు దేశాలలో కేవలం ఒక దేశంలో మాత్రమే ఉన్నాయి. ఈ సమాచారం లేకుండా, జాతీయ అభివృద్ధి లక్ష్యాలను ప్రణాళిక చేయడం, బడ్జెట్ కేటాయించడం మరియు సాధించడం దాదాపు అసాధ్యం.

> మహిళలు శ్రామిక శక్తిలో మరియు సమాజంలో పూర్తిస్థాయిలో పాల్గొనడానికి వీలు కల్పించే కీలకమైన మౌలిక సదుపాయాలైన శిశు సంరక్షణ మరియు వృద్ధుల సంరక్షణ వంటి ప్రజా సంరక్షణ వ్యవస్థలలో పెట్టుబడి పెట్టాలి. జాతీయ ఆదాయంలో 10 శాతాన్ని సంరక్షణ సేవలపై పెట్టుబడిగా పెట్టడం వల్ల పేదరికం తగ్గుతుంది, కుటుంబ ఆదాయాలు పెరుగుతాయి, మరియు లక్షలాది గౌరవప్రదమైన ఉద్యోగాలు సృష్టించబడతాయి.

"లింగ దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకోని బడ్జెట్‌లతో మనం లింగ అంతరాలను పూడ్చలేము" అని యూఎన్ ఉమెన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ న్యారాడ్జాయి గుంబోంజ్వాండా అన్నారు. ప్రభుత్వాలు తమ నిబద్ధతలకు వాస్తవ పెట్టుబడులతో మద్దతు ఇవ్వాలి మరియు డబ్బు ఎలా ఖర్చు చేయబడుతోంది, దానితో ఏమి సాధించబడుతోంది అనే విషయాలను పర్యవేక్షించాలి. లింగ సమానత్వం అనేది బడ్జెట్ కేటాయింపుల అంచులలో ఉండకుండా, ప్రజా విధానాల కేంద్రంలోకి రావాలి. దీనికి డబ్బు కావాలి. దీనికి సంస్కరణలు కావాలి. మరియు మహిళలను ఒక ఖర్చుగా కాకుండా, భవిష్యత్తుగా చూసే నాయకత్వం కావాలి. అంతర్జాతీయ ఫైనాన్సింగ్ సమావేశంలో, మహిళలు మరియు

బాలికల పురోగతిని వేగవంతం చేయడానికి మరియు 2030 సుస్థిర అభివృద్ధి అజెండా నిబద్ధతల దిశగా, ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం నిర్దిష్ట సిఫార్సులను ముందుకు తెస్తోంది. జాతీయ ప్రాధాన్యతలు లింగ సమానత్వ లక్ష్యాలతో ఏకీభవించేలా చూసేందుకు, లింగ-ప్రతిస్పందన బడ్జెట్ వినియోగాన్ని విస్తరించాలి మరియు పెంచాలి. దీనివల్ల నిధులు నిజంగా అవసరమైన చోటికి, అంటే అన్ని రంగాలలో మహిళలు మరియు బాలికల నిర్దిష్ట అవసరాలు మరియు హక్కులను తీర్చడానికి వెళ్లేలా నిర్ధారించవచ్చు. ఈ బడ్జెట్‌లను అమలు చేయడానికి మరియు పర్యవేక్షించడానికి దేశాలు తమ సంస్థలను మరియు రాజకీయ సంకల్పాన్ని కూడా బలోపేతం చేసుకోవాలి. వ్యవస్థాగతమైన, శాశ్వతమైన మార్పుకు ఇది కీలకం. తక్షణ రుణ ఉపశమనం, మరింత న్యాయమైన ప్రపంచ ఫైనాన్సింగ్ నియమాలు మరియు ప్రగతిశీల, లింగ-ప్రతిస్పందన పన్ను సంస్కరణలను అమలు చేయాలి. పొదుపు చర్యలను అంతం చేయడానికి మరియు ఆరోగ్యం, విద్య, మరియు సంరక్షణ వంటి అవసరమైన సేవలలో ప్రభుత్వ పెట్టుబడికి అవసరమైన ఆదాయాలను సమకూర్చడానికి ఈ చర్యలు చాలా కీలకం. లింగ సమానత్వం, శాంతి స్థాపన, మరియు సమ్మిళిత సామాజిక అభివృద్ధి వంటి దీర్ఘకాలిక మానవ అభివృద్ధి లక్ష్యాలను ప్రతిబింబించేలా ప్రభుత్వ వ్యయాన్ని పునఃసమతుల్యం చేయాలి. చట్టబద్ధమైన భద్రతాపరమైన ఆందోళనలను గుర్తిస్తూనే, ప్రభుత్వాలు తమ ప్రపంచ కట్టుబాట్లను నెరవేర్చడానికి సంరక్షణ, సమ్మిళితత్వం, మరియు స్థితిస్థాపకతపై మరింతగా పెట్టుబడి పెట్టాలి. మహిళలు శ్రామిక శక్తిలో మరియు సమాజంలో పూర్తిస్థాయిలో పాల్గొనడానికి వీలు కల్పించే కీలకమైన మౌలిక సదుపాయాలైన శిశు సంరక్షణ మరియు వృద్ధుల సంరక్షణ వంటి ప్రజా సంరక్షణ వ్యవస్థలలో పెట్టుబడి పెట్టాలి. జాతీయ ఆదాయంలో 10 శాతాన్ని సంరక్షణ సేవలపై పెట్టుబడిగా పెట్టడం వల్ల పేదరికం తగ్గుతుంది, కుటుంబ ఆదాయాలు పెరుగుతాయి, మరియు లక్షలాది గౌరవప్రదమైన ఉద్యోగాలు సృష్టించబడతాయి. నిరంతరంగా పెట్టుబడులు తక్కువగా ఉండటం వల్ల లింగ సమానత్వం, మహిళలు మరియు బాలికల హక్కుల నెరవేర్పు మరియు సాధికారత, 2030 అజెండా, మరియు బీజింగ్ కార్యాచరణ వేదిక వంటి అంశాలలో పురోగతి నిలిచిపోతోందని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం నొక్కి చెబుతోంది. ఈ సదస్సు ముగింపు దశలో, 420 బిలియన్ డాలర్ల లోటును పూడ్చడానికి అవసరమైన నిరంతర, పారదర్శక, మరియు జవాబుదారీ ఆర్థిక సహాయంతో రాజకీయ కట్టుబాట్లను సరిపోల్చాలని, తద్వారా ప్రపంచ జనాభాలో సగం మందికి ఇచ్చిన వాగ్దానాలను చివరకు నెరవేర్చాలని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ప్రపంచ నాయకులను కోరుతోంది.

# ‘రెండవ తరగతి’ ప్రయాణికులు అని పిలవొద్దు


## రైల్వే ప్రయాణికులపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు




రైల్వే ప్రయాణికుల ఆత్మగౌరవం, భద్రత, ప్రమాద పరిహారానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇకపై ప్రయాణికులను ‘రెండవ తరగతి ప్రయాణికులు’ అని సంబోధించవద్దని రైల్వే శాఖను ఆక్షేపించింది. ‘క్లాస్’ అనే విభజన కేవలం రైలు కోచ్‌లకు మాత్రమే పరిమితం కావాలని, మనుషులకు కాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రయాణికులను అలా పిలవడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది గత చరిత్రలోని వర్గ విభజనలను గుర్తు చేస్తోందని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ఒక రైలు ప్రమాద బాధితురాలికి రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన కోర్టు.. ప్రమాద సమయంలో టికెట్ పోయినంత మాత్రాన పరిహారాన్ని నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. బాధిత కుటుంబాలు అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని, సదరు ప్రయాణికుడికి టికెట్ లేదని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా రైల్వే శాఖదేనని స్పష్టం చేసింది. రైల్వే ప్రమాద పరిహార చట్టాలను మానవతా దృక్పథంతో, ఉదారంగా అమలు చేయాలని ధర్మాసనం హితవు పలికింది. భద్రతా నిబంధనలు కాగితాల్లో బాగున్నా.. క్షేత్రస్థాయిలో అమలు లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేసింది. రైల్వేల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, రైల్వే భద్రతను కూడా మెరుగుపరచవచ్చని కోర్టు సూచించింది. అదే సమయంలో ప్రయాణికులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రాణాలకు తెగించి ఫుట్‌బోర్డ్ ప్రయాణాలు చేయవద్దని ధర్మాసనం హెచ్చరించింది.

# సహజీవనానికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

## మధ్యప్రదేశ్ యూసీసీ ముసాయిదాలో ప్రతిపాదనలు




మధ్యప్రదేశ్‌లో అమలుచేయబోయే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)కి సంబంధించి ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీ తన తుది నివేదికలో సహజీవన సంబంధాలపై పలు కీలక నిబంధనలను ప్రతిపాదించింది. వాటి ప్రకారం.. సహజీవన బంధంలోకి ప్రవేశించే జంటలు తమ నివాస పరిధిలోని జిల్లా రిజిస్ట్రార్ వద్ద తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ బంధం ముగిసిపోతే దానిని అధికారికంగా రద్దు చేసుకోవాలి. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే గరిష్ఠంగా మూడు నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లును రాబోయే అసెంబ్లీ వర్షాకాల సమావేశంలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ ముసాయిదా ప్రకారం.. సహజీవన బంధంలోకి ప్రవేశించే జంటలు ఆ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలియజేయాలి. అలాగే ప్రతి పోలీసుస్టేషన్‌లో లివ్-ఇన్ జంటల వివరాలను నమోదు చేసి నిర్వహించాల్సి ఉంటుంది. సహజీవన జంటల గురించిన సమాచారాన్ని పొరుగువారు లేదా ఇంటి యజమాని సమాచారం ఇవ్వడానికి కూడా ముసాయిదా అవకాశం కల్పించింది. అంతేకాకుండా భాగస్వామిని పురుషుడు విడిచిపెడితే మహిళకు భరణం చెల్లించాల్సి ఉంటుందని ప్రతిపాదించింది. వారసత్వ చట్టాల్లో కూడా ముసాయిదా పలు మార్పులను సూచించింది. వాటి ప్రకారం.. మరణించిన వ్యక్తి ఆస్తిపై భార్య, పిల్లలు, తల్లితో పాటు తండ్రికి కూడా వారసత్వ హక్కులు దక్కుతాయి. ప్రస్తుతం వివాహం, విడాకులు, భరణం, వారసత్వ హక్కులు వంటి విషయాల్లో వేర్వేరు మతాలకు వేర్వేరు చట్టాలు ఉన్నాయని, వీటి స్థానంలో ఒకే చట్టాన్ని తీసుకురావాలని కమిటీ అభిప్రాయపడింది. కాగా రాష్ట్రంలోని గిరిజనులకు ఈ తొలిదశ చట్టం వర్తించబోదని ముసాయిదాలో కమిటీ పేర్కొంది.

# దేశవ్యాప్తంగా తగ్గిన స్కూల్ డ్రాప్‌అవుట్లు

## విద్యారంగంలో కీలక పురోగతి - కేంద్రం నివేదిక

దేశంలోని పాఠశాల విద్యా వ్యవస్థలో 2025-26 విద్యా సంవత్సరంలో కీలకమైన పురోగతి నమోదైంది. ముఖ్యంగా విద్యార్థుల స్కూల్ డ్రాప్‌అవుట్ రేటు గణనీయంగా తగ్గగా, సెకండరీ స్థాయిలో చేరికలు, కొనసాగింపు రేట్లు మెరుగుపడ్డాయి. అలాగే దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02 కోట్ల మార్కును దాటింది. ఈ వివరాలను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన యూడైస్ ప్లస్ 2025-26 నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం గత మూడు విద్యా సంవత్సరాలతో పోలిస్తే 2025-26లో విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి గణనీయంగా తగ్గింది.

ప్రిపరేటరీ స్థాయిలో 2024-25లో 2.3 శాతంగా ఉన్న డ్రాప్‌అవుట్ రేటు 2025-26లో 1.8 శాతానికి తగ్గింది. సెకండరీ స్థాయిలో ఇది 8.2 శాతం నుంచి 7 శాతానికి పడిపోయింది. అన్ని స్థాయిల్లోనూ ఈ తగ్గుదల కనిపించడం విద్యార్థులను చదువులో కొనసాగించే ప్రభుత్వ చర్యలు ఫలిస్తున్నాయని విద్యాశాఖ పేర్కొంది.

మిడిల్ స్థాయిలో విద్యార్థుల రిటెన్షన్ రేటు 82.8 శాతం నుంచి 83.7 శాతానికి పెరిగింది. సెకండరీ స్థాయిలో ఇది 47.2 శాతం నుంచి 51.9 శాతానికి చేరింది. అయితే ఫౌండేషన్, ప్రిపరేటరీ స్థాయిల్లో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. అయినప్పటికీ గత మూడేళ్లలో నమోదైన పురోగతి కొనసాగుతోందని నివేదిక పేర్కొంది.

దేశవ్యాప్తంగా సెకండరీ విద్య అందించే పాఠశాలల సంఖ్య పెరగడం వల్ల విద్యార్థులకు చదువు అందుబాటులోకి రావడంతో పాటు మధ్యలోనే చదువు మానేయకుండా కొనసాగించే అవకాశం పెరిగిందని విద్యాశాఖ తెలిపింది. ఇదే రిటెన్షన్ రేటు మెరుగుపడటానికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెకండరీ స్థాయిలో గ్రాస్ ఎన్రోల్మెంట్

రేషియో (GER) కూడా గణనీయంగా పెరిగింది. 2024-25లో 68.5 శాతంగా ఉన్న ఈ నిష్పత్తి 2025-26లో 71.7 శాతానికి చేరింది. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత తరగతుల్లో చేరుతున్నట్లు స్పష్టమవుతోంది.

## 1.02 కోట్లకు చేరిన ఉపాధ్యాయుల సంఖ్య

విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02 కోట్లను దాటింది. 2022-23తో పోలిస్తే 2025-26లో ఉపాధ్యాయుల సంఖ్య 8.3 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఉపాధ్యాయుల పెరుగుదలతో విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి మెరుగుపడటంతో పాటు ప్రాంతాల మధ్య ఉన్న కొరతను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుందని కేంద్ర విద్యాశాఖ తెలిపింది.

ఇక కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2025-26 ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరులో చండీగఢ్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. చండీగఢ్ ఒక్కటే 'ఉత్తమ్-3' గ్రేడ్ సాధించింది. పంజాబ్, కేరళ, ఢిల్లీతో పాటు దాద్రా నగర్ హవేలీ-దమన్ అండ్ డయ్యూ కేంద్ర పాలిత ప్రాంతం తదుపరి స్థాయిలో నిలిచాయి. అయితే ఏ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం కూడా అత్యున్నత 'ఉత్కర్ష్', 'ఉత్తమ్-1', 'ఉత్తమ్-2' గ్రేడ్లను అందుకోలేకపోయింది.

జిల్లాల వారీగా పరిశీలించినప్పటికీ అత్యున్నత 'ఉత్కర్ష్' గ్రేడ్ ఏ జిల్లాకూ దక్కలేదు. అయితే ఒక జిల్లా 'ఉత్తమ్-1', 19 జిల్లాలు 'ఉత్తమ్-2' గ్రేడ్ సాధించాయి. గత ఏడాదితో పోలిస్తే మంచి గ్రేడ్ సాధించిన జిల్లాల సంఖ్య పెరిగినట్లు నివేదిక తెలిపింది. మొత్తం 462 జిల్లాలు తమ పనితీరును మెరుగుపరుచుకోగా, వాటిలో 50 జిల్లాలు ఒక గ్రేడ్ నుంచి మరో మెరుగైన గ్రేడ్‌కు చేరుకున్నాయి. ఉత్తమ్-2 గ్రేడ్ సాధించిన జిల్లాల్లో ఢిల్లీ నుంచి నాలుగు, పంజాబ్ నుంచి ఏడు, కేరళ నుంచి మూడు, మహారాష్ట్ర నుంచి రెండు జిల్లాలు ఉన్నాయి. చండీగఢ్, డయ్యూ, హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. పెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో విద్యా ఫలితాలు, పాఠశాలలకు చేరువ, మౌలిక వసతులు, సమాన అవకాశాలు, పరిపాలన, ఉపాధ్యాయుల శిక్షణ వంటి ఆరు ప్రధాన విభాగాల్లోని 70 సూచికల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేశారు. జిల్లాల స్థాయిలో కూడా ఇదే తరహా ప్రమాణాలతో మూల్యాంకనం చేపట్టారు. ఏదేమైనా 2025-26 విద్యా సంవత్సరంలో డ్రాప్‌అవుట్ రేటు తగ్గడం, సెకండరీ స్థాయిలో చేరికలు పెరగడం, ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం వంటి అంశాలు దేశ విద్యా రంగంలో సానుకూల మార్పులకు సంకేతాలుగా కేంద్ర విద్యాశాఖ నివేదిక పేర్కొంది.

# రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన ముఖ్యం

## ఆకాశవాణి వర్క్‌షాప్‌లో జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ పిలుపు



మహిళల భద్రత, గౌరవాన్ని నిర్ధారించడానికి దేశంలో బలమైన చట్టాలు ఉన్నాయని, ప్రతి మహిళా చట్టం ప్రకారం తమ హక్కులను వినియోగించుకోవాలని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఆకాశవాణి నిర్వహించిన 'మహిళా-కేంద్రీకృత సమస్యలు మరియు సాధికారత కార్యక్రమాలు' అనే వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తూ, ఆమె లింగ సున్నితత్వం యొక్క ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

పురుషులు, మహిళలు ఇద్దరికీ సమాన అవకాశాలు, సమాన గౌరవం కల్పించాలని శ్రీమతి రహత్కర్ ఉద్ఘాటించారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కార) చట్టం 2013, గృహ హింసను పరిష్కరించే చట్టాలు వంటి కీలక శాసనాలను ప్రస్తావిస్తూ, ఈ చట్టాలపై అవగాహన లేకపోవడం తరచుగా మహిళలు న్యాయం పొందకుండా నిరోధిస్తుందని ఆమె పేర్కొన్నారు. పోష్ చట్టం కింద అంతర్గత కమిటీల ప్రాముఖ్యతను ఆమె నొక్కిచెప్పారు. వాటి పాత్ర కేవలం ఫిర్యాదులను పరిష్కరించడానికే పరిమితం కాదని, సురక్షితమైన, భద్రమైన మరియు గౌరవప్రదమైన కార్యక్షేత్ర వాతావరణాన్ని సృష్టించడం కూడా ఇందులో భాగమని ఆమె అన్నారు. మహిళలు నిర్భయంగా సమస్యలను నివేదించగలిగేలా మెరుగైన మౌలిక సదుపాయాలు, అవగాహన మరియు విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలని శ్రీమతి రహత్కర్ పిలుపునిచ్చారు.

ఈ సభను ఉద్దేశించి ఆకాశవాణి న్యూస్ సర్వీసెస్ డివిజన్ డైరెక్టర్ జనరల్ ధీరజ్ ఎం. కకాడియా మాట్లాడుతూ, కార్యక్షేత్రం సురక్షితంగా, న్యాయబద్ధంగా ఉండాలని, దోపిడీ పట్ల ఏమాత్రం సహనం ఉండకూడదని అన్నారు. ప్రతి మహిళ ఫిర్యాదును సరైన ప్రక్రియ ద్వారా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చట్టపరమైన నిబంధనలను దుర్వినియోగం చేయడం, తప్పుడు ఫిర్యాదులు చేయడం వల్ల నిజమైన బాధితుల విశ్వసనీయత, న్యాయవ్యవస్థ బలహీనపడతాయని పేర్కొంటూ, మహిళలు నిర్భయంగా నిజమైన సమస్యలను లేవనెత్తాలని కోరారు. మహిళా సాధికారతపై చట్టపరమైన అవగాహనను వ్యాప్తి చేయడానికి, ఆకాశవాణి జాతీయ మహిళా కమిషన్‌తో కలిసి ఒక ప్రత్యేక సిరీస్ ద్వారా సంయుక్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు.

# కర్ణాటక బస్సులో లైంగిక వేధింపుల కేసుపై సత్వరం విచారణ జరపండి

## డిజిపికి లేఖ రాసిన ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ విజయ రహత్కర్

కర్ణాటకలోని మంగళూరు-విట్టల్ మార్గంలో నడిచే ఒక ప్రైవేట్ బస్సులో కళాశాల విద్యార్థినులపై జరిగిన లైంగిక వేధింపుల ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) సుమోటోగా విచారణ చేపట్టింది. కేసులో వేగవంతమైన మరియు నిష్పక్షపాతమైన విచారణ జరిగేలా తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కర్ణాటక డీజీపీకి చైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారని కమిషన్ తెలిపింది. “కర్ణాటకలోని మంగళూరు-విట్టల్ మార్గంలో నడిచే ఒక ప్రైవేట్ బస్సులో మహిళా కళాశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులు జరిగినట్లు వచ్చిన వార్తలను ‘నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్’ (జాతీయ మహిళా కమిషన్) స్వయంగా పరిగణనలోకి తీసుకుంది” అని కమిషన్ పేర్కొంది. “మహిళా ప్రయాణికుల భద్రత, ప్రజా రవాణాలో భద్రతా ఏర్పాట్ల సమర్థత మరియు బలమైన నివారణ చర్యల ఆవశ్యకతకు సంబంధించిన తీవ్రమైన అంశాలను ఈ ఘటన ఎత్తిచూపుతోంది. దీనిపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది,” అని ఆ లేఖలో పేర్కొంది. అన్ని సంబంధిత చట్టపరమైన నిబంధనల కింద సమగ్రమైన ఛార్జ్‌షీట్‌ను వేగంగా దాఖలు చేయాలని, అలాగే సీసీటీవీ ఫుటేజ్ మరియు సాక్షుల వాంగ్మూలాలతో సహా అన్ని డిజిటల్ మరియు పరిస్థితుల ఆధారిత సాక్ష్యాలను సేకరించాలని రహత్కర్ కర్ణాటక డీజీపీని కోరారు. అలాగే, ప్రభుత్వ మరియు ప్రైవేట్ బస్సుల భద్రతపై సమగ్ర తనిఖీ (ఆడిట్) నిర్వహించాలని, సీసీటీవీల ఏర్పాటు, సిబ్బంది ధృవీకరణ మరియు బస్సుల్లో

మహిళల అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల ప్రదర్శనను కఠినంగా అమలు చేయాలని ఆమె కోరారు. బాధిత విద్యార్థినుల గోప్యతను కాపాడుతూనే, వారికి మానసిక కౌన్సెలింగ్ మరియు అవసరమైన మద్దతును అందించాలని కూడా చైర్‌పర్సన్ సూచించారు. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను ఏడు రోజుల్లోగా సమర్పించాలని కమిషన్ రాష్ట్ర పోలీసులను కోరింది. సకాలంలో న్యాయం జరిగేలా మరియు బాధ్యతాయుతమైన చర్యలు తీసుకునేలా చూసేందుకు ఈ వ్యవహారాన్ని నిశితంగా పర్యవేక్షిస్తామని జాతీయ మహిళా కమిషన్ తెలిపింది. మీడియా నివేదికల ప్రకారం, కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో మంగళూరు-విట్టల్ మార్గంలో నడిచే ఒక ప్రైవేట్ బస్సులో జూలై 9న ఈ ఘటన జరిగింది; ఇందులో కండక్టర్ అసభ్యకరమైన సైగలు చేస్తూ విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# 'జన్ సున్వాయి'లో గృహహింస ఫిర్యాదులే ఎక్కువ

## ఉన్నతస్థాయి సమీక్షలో ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ విజయ రహత్కర్

జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) చైర్‌పర్సన్ విజయ రహత్కర్ మోగాలో ఉన్నత స్థాయి "జన్ సున్వాయి" (ప్రజా విచారణ) మరియు పరిపాలనా సమీక్షను నిర్వహించారు. మోగాలోని డిఎం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆమె స్వయంగా 100కు పైగా ఫిర్యాదులను విన్నారు మరియు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోలీసు, సివిల్ యంత్రాంగాలకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా విచారణలో స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని రహత్కర్ పోలీసులకు మరియు సంబంధిత శాఖలకు సూచించారు. "మూడు రోజుల్లోగా తీసుకున్న చర్యల గురించిన సమగ్ర నివేదికను కమిషన్‌కు సమర్పించాలి" అని ఆమె ఆదేశించారు. అందిన ఫిర్యాదులలో ఎక్కువ భాగం గృహ హింసకు సంబంధించినవేనని గుర్తించిన ఆమె, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ఈ సున్నితమైన అంశాలను అత్యంత సానుభూతితో మరియు శ్రద్ధతో పరిష్కరించాలని నిర్దేశించారు. మహిళలకు సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు ఆమె ఒక కఠినమైన ఆదేశాన్ని జారీ చేశారు: 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న అన్ని కార్యాలయాలు (పాఠశాలలు, ఆసుపత్రులు, పారిశ్రామిక యూనిట్లు, ప్రభుత్వ మరియు ప్రైవేట్

కార్యాలయాలు) 'లైంగిక వేధింపుల నిరోధక చట్టం' ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆమె స్పష్టం చేశారు. పనిచేసే మహిళల్లో భద్రత మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు, ఈ కమిటీలు ఒక నెలలోగా పూర్తిస్థాయిలో పనిచేసేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

మహిళలపై మాదకద్రవ్యాల వ్యసనం చూపే ప్రభావాన్ని పరిశీలిస్తూ, మహిళలు అనుభవిస్తున్న మౌన వేదనను చైర్‌పర్సన్ ఎత్తిచూపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం కేవలం వ్యసనపరుడినే కాకుండా మొత్తం కుటుంబాన్ని నాశనం చేస్తుందని, ఇందులో గృహిణులు అత్యంత తీవ్రమైన మానసిక మరియు శారీరక బాధను అనుభవిస్తారని ఆమె నొక్కిచెప్పారు. ఆమె "మాదకద్రవ్యాలకు వద్దు, జీవితానికి అవును చెప్పండి" అనే నినాదంతో హాజరైనవారిని ఉత్తేజపరిచి, సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

పరిపాలనా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో, చైర్‌పర్సన్ రహత్కర్ వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత మహిళా కేంద్రీకృత పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని నొక్కి చెప్పారు. మహిళలను బలోపేతం చేయడానికి ఎంజీఎన్ఆర్ఈజీఏ, 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమాలలో వారి భాగస్వామ్యాన్ని, ఉపాధిని పెంచాలని, అలాగే బాలికల విద్య, మనుగడ కోసం క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆమె అన్నారు.

# కేరళ విద్యార్థిని హత్యపై దర్యాప్తును ముమ్మరం చేయండి

## కేరళ డిజిపికి జాతీయ మహిళా కమిషన్ లేఖ

కేరళకు చెందిన వైద్య విద్యార్థిని హత్యపై జాతీయ మహిళా కమిషన్ స్వయంగా స్పందించింది. ఈ ఘటనపై వేగవంతమైన దర్యాప్తు జరపాలని, విదేశీ వ్యవహారాల శాఖ మరియు తాష్కెంట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని, సాక్ష్యాలను భద్రపరచాలని మరియు బాధిత కుటుంబానికి పూర్తి మద్దతు అందించాలని కోరుతూ కేరళ డీజీపీకి ఎన్‌సిడబ్ల్యు లేఖ రాసింది. ఏడు రోజుల్లోగా తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. ఈ వ్యవహారంపై 7 రోజుల్లోగా తీసుకున్న చర్యల నివేదికను కేరళ డీజీపీ నుండి కోరింది. ఉజ్బెకిస్థాన్‌లో కేరళకు చెందిన 21 ఏళ్ల వైద్య విద్యార్థినిపై జరిగినట్లుగా చెబుతున్న హింస మరియు హత్య ఘటనపై

జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్పందించింది. ఆమె మరణానికి ముందు శారీరక దాడి, వేధింపులు మరియు బలవంతపు మత మార్పిడి ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వేగవంతమైన దర్యాప్తు, విదేశీ వ్యవహారాల శాఖ మరియు తాష్కెంట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం, సాక్ష్యాల భద్రత మరియు బాధిత కుటుంబానికి పూర్తి మద్దతు కోరుతూ కేరళ డీజీపీకి లేఖ రాసింది. ఏడు రోజుల్లోగా తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని కమిషన్ కోరింది. అలాగే, చట్టపరమైన ప్రక్రియను సులభతరం చేయడానికి మరియు ఈ విషయంలో సమర్థవంతమైన సహకారాన్ని నిర్ధారించడానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, అవసరమైన అన్ని సహాయాలను అందించాలని ఉజ్బెకిస్థాన్‌లోని భారత రాయబారిని కూడా కోరింది. గమనించదగ్గ విషయం ఏమిటంటే, మరణానికి ముందు ఆమెపై దారుణంగా దాడి జరిగిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేరళ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లిదండ్రులు జిల్లా పోలీస్ చీఫ్‌ను ఆశ్రయించిన తర్వాత, హరిపాడ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని అధికారులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా అలప్పుజ మెడికల్ కాలేజీలో పోస్టుమార్టం పరీక్ష కూడా నిర్వహించారు. ఆరోపించబడిన నేరం భారతదేశం వెలుపల జరిగినప్పటికీ, కేరళ పోలీసులు చట్టపరంగా కేసు నమోదు చేయవచ్చని కాయంకుళం డిప్యూటీ ఎస్పి బినుకుమార్ తెలిపారు. “నేరం ఉజ్బెకిస్తాన్‌లో జరిగినప్పటికీ, ఇక్కడ కేసు నమోదు చేయడానికి నిబంధనలు ఉన్నాయి. అక్కడ పోలీసులు నిందితుడిపై చర్యలు తీసుకుంటే, మేము ఈ కేసును మూసివేస్తాము. ఒకవేళ అక్కడ ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, మేము ఈ కేసును ముందుకు తీసుకువెళతాము,” అని ఆయన అన్నారు.

అక్కడ జరుగుతున్న దర్యాప్తు స్థితిగతులను తెలుసుకోవడానికి భారత రాయబార కార్యాలయం మరియు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా ఉజ్బెకిస్తాన్‌లోని అధికారులతో సమన్వయం చేసుకుంటామని పోలీసులు తెలిపారు. బినుకుమార్ ప్రకారం, నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. “నిందితుడిని అక్కడ అరెస్టు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. కేసు వివరాలు మరియు ఉజ్బెకిస్తాన్ అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకోవడానికి మేము విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా ముందుకు వెళతాము,” అని బినుకుమార్ చెప్పారు.

అయితే, బాధితురాలి కుటుంబం ఈ దర్యాప్తు ఉజ్బెకిస్తాన్ పరిధిని దాటి జరగాలని కోరుకుంటోంది. వారు కేరళ పోలీసులను ఈ కేసును స్వతంత్రంగా దర్యాప్తు చేయాలని

కోరారు మరియు నిందితుడిని భారతదేశానికి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఉజ్బెకిస్తాన్‌లో బాధితురాలితో కలిసి చదువుకున్న మలప్పురానికి చెందిన తోటి వైద్య విద్యార్థి అయిన నిందితుడు, ఒక వాదన సమయంలో ఆమె తలపై కొట్టి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ కుటుంబ సభ్యులు ఆ వాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విలేకరులతో మాట్లాడిన బంధువులు, బాధితురాలి మృతదేహంపై అనేక గాయాలు ఉన్నాయని, దీనిని బట్టి ఆమె దీర్ఘకాలం పాటు హింసకు గురైందని తెలుస్తోందని చెప్పారు.


ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడానికి ఉజ్బెకిస్తాన్ వెళ్లిన కుటుంబ సభ్యుడు ఒకరు మాట్లాడుతూ, ఆమె మరణానికి ముందు హింసకు గురైందని అక్కడి దర్యాప్తు అధికారులు తనకు చెప్పారని పేర్కొన్నారు. నిందితుడు బాధితురాలిని మతం మారమని ఒత్తిడి చేయడం చాలా మంది విద్యార్థులు చూశారని దర్యాప్తు అధికారులు తనకు తెలిపారని ఆయన మరింతగా ఆరోపించారు.

---

# బాలికపై లైంగిక దాడి కేసులో నలుగురికి రిమాండ్

## పరారీలో మరో ఇద్దరు, మూడు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలికపై సామూహిక లైంగిక దాడి కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఎల్.ఆదినారాయణ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం, క్రైమ్ నంబర్ 109/2026 కింద భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టం, ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా నలుగురిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా మూడు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.




# ప్రేమ ఉన్మాదంగా మారితే..
# అనుక్షణం మరణభయమే

**తస్మాత్ జాగ్రత్త**

# ప్రేమోన్మాది ఘాతుకం.. యువతి దారుణ హత్య

తన ప్రేమను నిరాకరించిందని ఉన్మాదిగా మారిన యువకుడు.. రద్దీగా ఉండే బస్టాండ్‌లో యువతిని దారుణంగా హత్య చేశాడు. బాధితురాలు లావణ్యకు నిందితుడు చేతన్ వరసకు బంధువు అవుతాడని సమాచారం. అతను కొంతకాలంగా లావణ్యను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండగా, ఆమె అతని ప్రేమను నిరాకరించింది. దాంతో పగ పెంచుకున్న చేతన్, బంట్వాల్‌లోని రద్దీగా ఉండే కేఎస్ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణికులు అందరూ చూస్తుండగానే లావణ్యపై దాడి చేసి ప్రాణాలు తీశాడు. బహిరంగ ప్రదేశంలో జరిగిన ఈ క్రూరమైన హత్య సంఘటన స్థానిక ప్రజలను షాక్‌కు గురి చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాల గురించి వివరాలను సేకరిస్తున్నారు. హత్య చేసిన వెంటనే దుండగుడు పారిపోయాడు. అతని కోసం అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు చేతన్‌ను త్వరగా గుర్తించి.. కఠినమైన శిక్షపడేలా చేస్తామన్నారు అధికారులు. బంట్వాల్ ప్రాంతంలో రద్దీగా ఉండే బస్టాండ్‌లో ఈ ఘటన చోటు చేసుకోవడంతో చర్చనీయాంశంగా మారింది.

# ఎయిర్‌పోర్టు ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నం.. నిందితుడి అరెస్ట్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తున్న ఓ యువతిపై క్యాబ్‌డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ఫిర్యాదు మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని శంషాబాద్‌లోని సిద్ధాంతి వద్ద గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో ఉద్యోగినిగా ఆ యువతి పనిచేస్తోంది. రోజు మాదిరిగానే నైట్‌షిఫ్ట్ కోసం క్యాబ్‌లో ఆమె విమానాశ్రయానికి బయలు దేరింది. ప్రయాణ మధ్యలో క్యాబ్‌డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ (23) కారును అసలు మార్గం నుంచి కాకుండా దారిమళ్లించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం టాయిలెట్‌కు వెళ్తానని చెప్పి కారు దిగాడు. ఆ తర్వాత

వెనుక సీటు వైపు నుంచి తిరిగి కారులోకి ప్రవేశించి యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఇండిగో ఉద్యోగిని ప్రతిఘటించడంతో క్యాబ్‌డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటన అనంతరం బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించారు. గంటల వ్యవధిలోనే ఎర్రపోగు ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. మహిళలు రాత్రి వేళల్లో లేదా ఒంటరిగా ప్రయాణించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## శంషాబాద్‌లో కలకలం.. తెల్లటి సంచిలో రోజుల పసికందు

శంషాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్డుపై రెండు రోజుల ఆడ శిశువు లభ్యమైంది. తెల్లటి సంచిలో పసికందును గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. రోడ్డుపై ఉన్న శిశువును గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆర్‌జీఐఏ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పసికందును రక్షించారు. అనంతరం శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆ చిన్నారిని అమీర్‌పేట్ శిశు విహార్ సంరక్షణలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు. శిశువు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. శిశువును అక్కడ వదిలివెళ్లిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో అరెస్టు

బాలికపై లైంగిక దాడికి పాల్పడి, కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన బాలెంల చైతన్య (22) హైదరాబాదులోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కొంతకాలంగా అడ్డగూడూరు గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. సాయంత్రం వేళ బాలిక ఉంటున్న ఇంటి గోడ దూకి లోపలికి వచ్చి

ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక అమ్మమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలో చైతన్యపై పోక్సో కేసు నమోదుచేసిన ఎస్ఐ వెంకట్‌రెడ్డి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 13వ తేదీన భువనగిరి భరోసా కేంద్రంలో మహిళా ఎస్ఐ సమక్షంలో బాధితురాలి వాంగ్మూలం రికార్డు చేశారు. చైతన్య తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధిత బాలిక పోలీసులకు చెప్పింది. వాంగ్మూలం నమోదుచేసిన అనంతరం బాలికను హైదరాబాద్ మలక్‌పేటలోని ఆమె పిన్ని ఇంటికి తీసుకువెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి చైతన్య మలక్‌పేటలో ఉన్న బాలికను తీసుకువెళ్లాడు. బాలిక పిన్ని ఫిర్యాదు మేరకు నింతుడిపై మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. నిందితుడి కోసం అడ్డగూడూరు, మలక్‌పేట పోలీసులు గాలిస్తున్నారు. బాలికను చైతన్య ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి తీసుకువెళ్లి తిరిగి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. హైదరాబాద్ సమీపంలో వారిద్దరినీ అదుపులోకి తీసుకుని చైతన్యను నల్లగొండ సబ్‌జైలుకు, బాలికను సంరక్షణ నిమిత్తం భువనగిరి సఖి కేంద్రానికి తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# టీచర్‌పై జిమ్ ట్రైనర్ అఘాయిత్యం

## మత్తు మందు ఇచ్చి అత్యాచారం.. వీడియోలు చూపించి బ్లాక్‌బెయిల్

ఇన్‌స్టాలో ఓ యువతితో జిమ్ ట్రైనర్ పరిచయం పెంచుకున్నాడు. ఫిట్‌నెస్ టిప్స్ చెబుతానని జిమ్‌కు రప్పించుకున్నాడు. తర్వాత ఆమెకు మత్తు మందిచ్చి అత్యాచారం చేశాడు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు కాజేశాడు. ఇంకా వేధిస్తూ వీడియోలు వైరల్ చేశాడు. విజయవాడలో జరిగిన ఈ దారుణంపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. విజయవాడకు చెందిన ఆ యువతి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. దేవీనగర్ మొదటి వీధికి చెందిన అబ్దుల్ ఖాదర్ సత్యనారాయణపురంలోని రాక్ ఫిట్‌నెస్ వరల్డ్ జిమ్‌లో ట్రైనర్ ఉన్నాడు. 4 నెలల క్రితం అతడు ఇన్‌స్టాలో ఈ యువతిని పరిచయం చేసుకున్నాడు. లావుగా ఉన్నావని, ప్రొటీన్ షేక్‌లు తీసుకుని జిమ్ చేస్తే సన్నబడతావని చెప్పి జిమ్‌కు రప్పించుకున్నాడు. ఏప్రిల్‌లో.. పక్కనే ఉన్న హోటల్ గదికి రావాలని చెప్పి మత్తుమందు కలిపిన ప్రొటీన్ షేక్ ఇచ్చాడు. ఆమె తాగగానే స్పృహ కోల్పోయింది. రెండు గంటల తర్వాత మెలకువ వచ్చి లేచి చూడగా, ఒంటిపై దుస్తులు లేకపోవడాన్ని గుర్తించింది. నగ్న వీడియోలు, ఫొటోలు తన వద్ద ఉన్నాయని, ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరించాడు. ఐఫోన్ 16తో పాటు ఫోన్‌పే

ద్వారా రూ.20 వేలు, రూ.50 వేలు దోచాడు. ఈ నేపథ్యంలో జూన్ 22న సత్యనారాయణపురంలోని హోటల్‌కు తీసుకెళ్లి దారుణంగా ప్రవర్తించి గాయపరిచాడు. మర్నాడు స్నేహితురాలి సాయంతో ఖాదర్ ఇంటికి వెళ్లి నిలదీయగా, కులం పేరుతో దూషించి దాడి చేయడానికి ప్రయత్నించాడు. ఇంటికి వచ్చి గొడవ చేసిందన్న కక్షతో ఆమె నగ్నచిత్రాలు, వీడియోలను ఇతరులకు చూపించడం మొదలుపెట్టాడు. బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

# పాము కాటుతో భర్తను హతమార్చిన భార్య

## ప్రియుడితో సహా నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో ఘోరం జరిగింది. ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న భర్తను ఓ మహిళ తన ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ ఘటనలో మహిళ, ఆమె ప్రియుడు, పాములను ఆడించే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుడిని 32 ఏళ్ల అతుల్ పన్వార్‌గా పోలీసులు గుర్తించారు. మీరట్ జిల్లాలోని భండోరా గ్రామానికి అతుల్ పన్వార్ తన భార్య దామిని (30), ఆరేళ్ల కుమారుడితో కలిసి హస్తినాపుర్‌లోని ఒక అద్దె ఇంట్లో నివసిస్తుండేవాడు. అతుల్, దామిని ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. గత నాలుగేళ్లుగా ఈ దంపతులు తమ ఇంటికి సమీపంలోనే 'కృష్ణ కిడ్స్ ప్లే స్కూల్'ను నడుపుతున్నారు. అందులో సుమారు 150 మంది పిల్లలు చదువుతున్నారు. అయితే దామినికి ఆ స్కూల్ వ్యాన్ డ్రైవర్ తుషార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో ప్రియుడితో కలిసి భర్తను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. అతుల్ తాగే పాలలో దామిని అధిక మోతాదులో నిద్రమాత్రలు కలిపింది. దీంతో అతడు గాఢమైన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత దామిని ప్రియుడు తుషార్ పాములను ఆడించేవారి నుంచి కొనుగోలు చేసిన విషపూరిత సర్పాన్ని తెచ్చి అతుల్ దుప్పటిలో వదిలాడు. ఆ పాము అతుల్‌ను కాటేసింది. దామిని, ఇతర కుటుంబ సభ్యులు అతుల్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతుల్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు అప్పటికే దామినిపై అనుమానం ఉంది. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ముందస్తు పథకం ప్రకారం జరిగిన హత్య అని ఆరోపించారు. పోలీసులు, ఫోరెన్సిక్ బృందం రంగంలోకి దర్యాప్తు చేపట్టాయి.

ప్రాథమిక విచారణ సమయంలో దామిని పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. అర్ధరాత్రి సమయంలో వేడి కారణంగా తాను తన కుమారుడిని తీసుకుని వేరే

గదిలో పడుకున్నానని ఆమె చెప్పింది. ఉదయం టీ తీసుకుని అతుల్ గదికి వెళ్లినప్పుడు, అతను దుప్పటి కప్పుకుని ఉన్నాడని తెలిపింది. తాను పిలిచినా అతను స్పందించకపోవడంతో దుప్పటిని తొలగించి చూడగా అక్కడ ఒక నల్ల సర్పం కనిపించిందని, అతుల్ కుడి కాలిపై పాము కాటు గుర్తులు ఉన్నాయని పేర్కొంది. దామిని మొబైల్ ఫోన్ కాల్ డేటా రికార్డులను పరిశీలించిన పోలీసులు ఆమె తన పాఠశాలలోని వ్యాన్ డ్రైవర్ తుషార్‌తో తరచుగా మాట్లాడినట్లు గుర్తించారు. ఆ తర్వాత తుషార్‌ను అదుపులోకి తీసుకుని తమదైన రీతిలో దర్యాప్తు చేపట్టారు. అప్పుడు అసలు నిజం బయటపడింది. అతుల్ హత్య వెనుకున్న కుట్రను తుషార్ బయటపెట్టాడు. తాను, దామిని ప్రేమలో ఉన్నామని, పెళ్లి చేసుకోవాలని అనుకున్నామని పోలీసుల విచారణలో తుషార్ చెప్పాడు. అతుల్ గతంలో ఒక కంప్యూటర్ కంపెనీలో పనిచేసేవాడు. అతడికి రూ. 20 లక్షల విలువైన బీమా పాలసీ ఉంది. అందుకే అతుల్‌ను చంపి ఆ బీమా సొమ్మును కాజేయాలని తుషార్, దామిని ప్లాన్ చేశారు. ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలని భావించారు. కాగా, గతంలోనూ అతుల్‌ను ఎర్టిగా కారుతో ఢీకొట్టి చంపడానికి తుషార్ ప్రయత్నించాడు. కానీ అదృష్టవశాత్తు అతుల్ ఆ ప్రమాదం నుంచి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కానీ తుషార్, దామిని చేసిన కుట్రకు అతుల్ బలైపోయాడు. ఉదయం 6 గంటల సమయంలో అనుమానాస్పద పరిస్థితుల్లో అతుల్ మరణించినట్లు హస్తినాపుర్ పోలీసులకు సమాచారం అందిందని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అవినాశ్ పాండే తెలిపారు. అతుల్ మంచంపై ఒక పాము కనిపించిందని చెప్పారు. పోలీసులు, మవానా సర్కిల్ ఆఫీసర్ (సీఓ) వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారని వెల్లడించారు. అతుల్ మరణాన్ని పాము కాటుగా చిత్రీకరించడానికి అతని భార్య దామిని ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టగా అసలు నిజం బయట పడిందని చెప్పారు.

## భార్యకు ఉరి వేసి.. ఆమె తల్లిదండ్రులకు వీడియో కాల్..

కర్ణాటకలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో ఘాతుకానికి ఒడిగట్టాడు. వివాహేతర సంబంధం కొనసాగిస్తోందన్న అనుమానంతో ఆమెకు ఉరి వేశాడు. భార్య తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి.. ఉరికి వేలాడుతూ ప్రాణం కోసం పోరాడుతున్న ఆమెను లైవ్‌లో వారికి చూపించాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బాగల్‌కోట్ జిల్లా, గలగాలి గ్రామానికి చెందిన ప్రవీణ్ జిగలూర్, భాగ్యశ్రీ జిగలూర్ భార్యాభర్తలు. భార్య వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుందని ప్రవీణ్ అనుమానం పెంచుకున్నాడు. గత కొన్ని నెలలనుంచి భార్యాభర్తల మధ్య గొడవలు

జరుగుతున్నాయి. ఈ గొడవల కారణంగా భాగ్యశ్రీ భర్తతో ఉండలేకపోయింది. రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రవీణ్ భార్యకు తరచుగా ఫోన్ చేసి ఇంటికి రమ్మని బతిమలాడటం మొదలెట్టాడు. భర్త అంతగా బతిమలాడుతుంటే ఆమె కాదన లేకపోయింది. పుట్టింటినుంచి భర్త దగ్గరకు వచ్చిన కొన్ని గంటలకే భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. గొడవ చిలికి చిలికి గాలివానలా మారింది. ప్రవీణ్ భార్యను కర్రతో చితకబాదాడు. తర్వాత ఆమెకు దుపట్టాతో ఉరివేశాడు. భాగ్యశ్రీ తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి.. ఉరికి వేలాడుతూ ప్రాణాల కోసం పోరాడుతున్న ఆమెను లైవ్‌లో చూపించాడు. భాగ్యశ్రీ తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రవీణ్ ఇంటి దగ్గరకు వెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయింది. పోలీసులు భాగ్యశ్రీ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# మద్యం మత్తులో కన్నబిడ్డల ముందే భార్యను నరికి చంపిన భర్త

ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లాలో మద్యం, జూదానికి బానిసైన ఓ కసాయి భర్త.. 8 నెలల గర్భిణీ అయిన తన భార్యను అత్యంత దారుణంగా చంపేశాడు. కన్నబిడ్డల ముందే కొడవలితో భార్యను నరికి చంపేశాడు. పన్వారీ పోలీసు స్టేషన్ పరిధిలోని బిజ్రారీ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిజ్రారీ అనే గ్రామంలో హనిఫ్ మన్సూరి, మనిషా దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. మన్సూరి మద్యానికి, జూదానికి బానిసగా మారి.. ఇప్పటికే తనకున్న భూమిలో చాలా వరకు అమ్మేశాడు. అంతేకాక మద్యం తాగేందుకు డబ్బుల కోసం తరచూ మనిషాను వేధిస్తుండే వాడు. మద్యం తాగి ఇంటికి వచ్చిన మన్సూరి.. అక్కడ కూడా మరింతంగా మద్యం సేవించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో మందు తాగొద్దని అతని భార్య మనీషా వారించింది. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన మన్సూరి కొడవలి తీసుకుని, ఎనిమిది నెలల గర్భిణీ అని కూడా చూడకుండా ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి పొట్టనబెట్టుకున్నాడు. ఈ అఘాయిత్యం జరిగిన సమయంలో వారి పిల్లలు కూడా అక్కడే ఉన్నారు. నేరం నుంచి తప్పించుకునేందుకు మన్సూరి తానే స్వయంగా పోలీసులకు ఫోన్ చేసి ఒక కట్టుకథ

అల్లాడు. అయితే, భయంతో వణికిపోతున్న ఐదేళ్ల పసిబాలుడు జరిగిన విషయాన్ని పోలీసులకు తెలపడంతో నిందితుడి బాగోతం బట్టబయలైంది. పన్వారీ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది. మృతురాలి కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. తమ బిడ్డను మన్సూరి నిత్యం వేధింపులకు గురిచేసేవాడని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుడి తండ్రి సైతం తన కొడుకు చేసిన పాపానికి మరణశిక్ష విధించినా తప్పులేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## ప్రియురాలితో చనువుగా ఉంటున్నాడని సహోద్యోగి హత్య..

ప్రియురాలితో చనువుగా మాట్లాడుతున్నాడన్న కోపంతో ఓ యువకుడు సహోద్యోగిపై దారుణానికి పాల్పడ్డాడు. అతి కిరాతకంగా పదునైన ఆయుధంతో సహోద్యోగిని పొడిచి చంపేశాడు. ఈ సంఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బరేలీకి చెందిన సురేశ్ అనే వ్యక్తి గ్రేటర్ నోయిడాలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అదే కంపెనీలో నరేశ్ అనే యువకుడు, బాబీ అనే యువతి కూడా పని చేస్తున్నారు. నరేశ్, బాబీ ఏడేళ్లనుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే గత కొద్దిరోజుల నుంచి బాబీ, సురేశ్ చనువుగా ఉంటున్నారు. ఈ విషయం నరేశ్‌కు తెలిసి ఆగ్రహానికి గురయ్యాడు. ఒకరితో ఒకరు మాట్లాడుకోవద్దని బాబీ, సురేశ్‌లకు వార్నింగ్ ఇచ్చాడు. దీంతో నరేశ్, సురేశ్‌ల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. నరేశ్, సురేశ్ ఇద్దరూ కలిసి సిర్సా సర్కిల్ వద్ద బీర్లు తాగారు. ఈ నేపథ్యంలోనే బాబీ విషయంలో ఇద్దరికీ గొడవ మొదలైంది. ఆ గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. నరేశ్ తన వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో సురేశ్‌పై దాడి చేశాడు. సురేశ్ కూడా నరేశ్‌పై దాడి చేశారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు. సురేశ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. నరేశ్‌కు చికిత్స అందించారు. చికిత్స అనంతరం నరేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## విదేశీ యువతిపై అసభ్య ప్రవర్తన.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై కేసు

కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. సదరు యువతి.. తన

బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# పథకం ప్రకారమే కేతన్ అగర్వాల్ హత్య

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యువ పారిశ్రామికవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తులో పుణె రూరల్ పోలీసులు పలు విషయాలను గుర్తించారు. నిందితులైన సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి పక్కా పథకం ప్రకారమే హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. కేతన్‌ను హత్య చేసేందుకు నిందితులు మొదట లోహగఢ్ కోటను కాకుండా వేరే ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

కేతన్ హత్యను ఏ విధంగా అమలు చేయాలనే దానిపై నిందితులిద్దరూ కొన్ని వారాల పాటు రెక్కీ నిర్వహించారు. హత్య చేయడానికి ముందు వారు లోనావాలాలోని ప్రసిద్ధ 'టైగర్ పాయింట్'తో పాటు సమీపంలోని విసాపూర్ కోట, ఇతర ఎత్తైన ప్రాంతాలను పరిశీలించారు. తొలుత టైగర్ పాయింట్ ప్రాంతంలో చంపాలని భావించారు. చివరకు లోహగఢ్ కోటను హత్యకు అనువైన ప్రదేశంగా ఎంచుకున్నారు. మే 31కి ముందే వీరు లోహగఢ్ కోటను ఖరారు చేసుకుని, దానికి సంబంధించిన ఫొటోలను కూడా ఒకరికొకరు షేర్ చేసుకున్నట్లు దర్యాప్తు అధికారి ఒకరు తెలిపారు.

కేతన్ హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు పక్కా స్కెచ్ వేసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదంగా చిత్రీకరించే కంటే ముందు.. హత్య చేసేందుకు నిందితులు పథకం వేశారని ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. కేతన్‌ను చంపేందుకు ఓ కిరాయి వ్యక్తి కోసం ఇద్దరూ చర్చించుకున్నారని, అయితే ఎవరిని నిందితులు సంప్రదించలేదని పోలీస్ అధికారి వెల్లడించారు. కేతన్‌ను

చంపేందుకు విష ప్రయోగంతో సహా ఇతర మార్గాలపై నిందితులు పరిశోధన చేశారని, అలాగే కేసు నుంచి తప్పించుకునేందుకు మార్గాలను కూడా అన్వేషించారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

# భార్యను ప్రియురాలి ఇంటికి తీసుకెళ్లి హత్య

హర్యానాలో దారుణం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ భర్త ఘాతుకానికి ఒడిగట్టాడు. భార్యను ప్రియురాలి ఇంటికి తీసుకెళ్లి తుపాకితో కాల్చి చంపేశాడు. పెళ్లైన మూడు నెలలకే భార్యపై ఈ దారుణానికి పూనుకున్నాడు. హత్య అనంతరం భర్త తన ప్రియురాలితో కలిసి నేపాల్ పారిపోయాడు. నెల రోజుల తర్వాత నిందితులిద్దరూ ఇండియాకు తిరిగి రావటంతో పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. గురుగ్రామ్‌లోని మనేశ్వర్‌కు చెందిన 25 ఏళ్ల అంకిత్ అనే వ్యక్తికి మూడేళ్ల క్రితం ఝజ్జర్ జిల్లాకు చెందిన 38 ఏళ్ల రజనీ దేవీతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది.

అయితే, అంకిత్.. రజనీని కాకుండా మధు అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. గత ఫిబ్రవరి నెలలో మధు, అంకిత్‌ల పెళ్లి జరిగింది. పెళ్లి తర్వాత కూడా అంకిత్ తన ప్రియురాలితో సంబంధాన్ని కొనసాగించాడు. ఈ నేపథ్యంలోనే అంకిత్, రజనీ కలిసి మధును చంపాలని నిశ్చయించుకున్నారు. మే 21వ తేదీన అంకిత్ తన భార్యను ప్రియురాలి గదికి తీసుకెళ్లాడు. అక్కడ మధును తుపాకితో కాల్చి చంపాడు. మధు చనిపోయిందని ధ్రువీకరించుకున్న తర్వాత అంకిత్, రజనీ దేవీ హరిద్వార్ పారిపోయారు. అక్కడినుంచి నేపాల్ వెళ్లిపోయారు. మధు ఇంటికి తిరిగి రాకపోవటంతో ఆమె తల్లి మే 22వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే రోజున పోలీసులు రజనీ దేవీ గది దగ్గరకు వెళ్లారు. గదిలో మధు శవాన్ని గుర్తించారు. మిస్సింగ్ కేసును మర్డర్ కేసుగా మార్చి దర్యాప్తు కొనసాగించారు. అంకిత్, రజనీలు జూన్ 30వ తేదీన ఇండియాలోకి రాగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చేసిన నేరం అంగీకరించారు. పోలీసులు నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది.

## వివాహేతర బంధం

# భర్త దారుణ హత్య

## భార్య, ప్రియుడితో పాటు ఆరుగురి అరెస్టు

తమిళనాడు వాసి రమేష్ హత్య కేసులో భార్య హాసినియే హంతకిగా తేలింది. గుడుపల్లె మండలంలోని మల్లప్పకొండకు భార్య హాసిని, ఏడాదిన్నర బిడ్డతో కలిసి వెళ్లిన రమేష్ ఈనెల 14న హత్యకు గురైన విషయం తెలిసిందే. తర్వాత హాసిని, బిడ్డ అదృశ్యమైన నేపథ్యంలో కుప్పం పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. కేసును ఛేదించారు. డీఎస్పీ పార్థసారథి మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం శాంతిపురం మండలం బోయనపల్లెకు చెందిన హాసిని, తమిళనాడులోని దేవదాసనపల్లెకు చెందిన రమేశ్ (30)లకు 2024లో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర వయసున్న మౌనిక అనే కుమార్తె ఉంది. హాసినికి, సొంతూరికి చెందిన గంగాధర్‌తో స్కూలు రోజుల నుంచే పరిచయం ఉంది. అది ప్రేమగా మారింది. అయితే తల్లిదండ్రులు చిన్న వయసులోనే రమేష్‌తో పెళ్లి చేశారు. పెళ్లయ్యేనాటికి ఆమె వయసు 18 ఏళ్లు లేదా అంతకంటే తక్కువే. ప్రసవం కోసం వచ్చిన హాసిని ఏడాదిపాటు పుట్టింట్లోనే ఉండిపోయింది. ఈ సమయంలో గంగాధర్‌తో వివాహేతర సంబంధం కొనసాగింది. ఈక్రమంలో భర్త రమేశ్ అడ్డు తొలగించుకోవడానికి ప్రియునితో కలిసి ప్లాన్ వేసింది. ఇందుకోసం గంగాధర్ తన స్నేహితుల సహకారం కూడా తీసుకున్నాడు. ప్లాన్‌లో భాగంగా భర్త రమేష్‌ను వెంట తీసుకుని బిడ్డతో సహా ఈనెల 13న పుట్టినూరు బోయనపల్లెకు వచ్చింది. 14న మొక్కు ఉందని నమ్మించి భర్త, బిడ్డతో ద్విచక్ర వాహనంపై మల్లప్పకొండకు బయలుదేరింది. మూడో ఘాట్ వద్ద వాహనాన్ని ఆపించింది. అంతకుముందే మొబైల్ ద్వారా ప్రేమికుడు గంగాధర్‌కు లైవ్ లొకేషన్ షేర్ చేసింది. అప్పటికే మాటువేసివున్న నిందితులు, రమేష్‌ను అడవిలోకి లాక్కునివెళ్లి, తాడుతో కాళ్లూచేతులూ కట్టేసి కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి హతమార్చారు. భర్త హత్యకు ప్రియుడు గంగాధర్‌తో కలిసి హాసిని పకడ్బందీగా ప్లాన్ వేసినా, చివరకు నిందితులు సీసీటీవీ ఫుటేజీవల్ల దొరికిపోయారు. ఈ కేసులో ఏ-1 గా ఆర్.గంగాధర్, ఏ-2 గా సీఎస్.హాసిని, ఏ-3 గా పవన్, ఏ-6 గా వై.శేఖర్, ఏ-7 గా సంతోష్, ఏ-8 గా సురేంద్రలను గుర్తించారు. వీరిని శాంతిపురం మండలం వివరామపురం సమీపంలోని పాలారు బ్రిడ్జివద్ద

అటవీ ప్రాంతంలో అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. మరో ఇద్దరు నిందితులు శ్యాంసన్, శివలు పరారీలో ఉన్నారు. వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

పోలీసులకు లభించిన సీసీటీవీ ఫుటేజీ హత్య వెనుక గల గుట్టు విప్పింది. బిడ్డను చేతపట్టుకుని ఓ మహిళ ఇద్దరు పురుషులతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ కనిపించిన దృశ్యాన్ని పోలీసులు గుర్తించారు. అంతకుముందు అదే ద్విచక్ర వాహనంపై ఆమె అదే మార్గంలో బిడ్డతో కలిసి భర్త రమేష్‌తో ప్రయాణిస్తున్న ఫుటేజీ కూడా లభించింది. ఈక్రమంలోనే పోలీసులు అనుమానించారు. వివాహేతర సంబంధమనే కోణంలో దర్యాప్తు తీవ్రతరం చేశారు. కేసును పోలీసులు ఛేదించగలిగారు.

# భర్తను కడతేర్చిన నవవధువు

## కాల్వలో పడేసి ప్రమాదంగా చిత్రీకరణ!

పెళ్లయి ఇంకా కొన్ని రోజులు కాకముందే, తన వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ నవవధువు తన ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేయించిన ఉదంతం హర్యానాలో కలకలం సృష్టించింది. తొలుత ఇదొక ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా భావించినప్పటికీ, చివరికి అసలు నిజాలు బయటపడ్డాయి. జర్తాల్ గ్రామానికి చెందిన 21 ఏళ్ల మోను అనే యువకుడు స్థానికంగా చిన్న చిన్న పనులు చేస్తూ, ఇటీవల జలియావాస్‌లో ఒక షాపును కూడా ప్రారంభించాడు. అతనికి కొద్దిరోజుల క్రితమే కసోలి గ్రామానికి చెందిన తన్ను అనే యువతితో వివాహం జరిగింది. అయితే, ఈ పెళ్లి తన్నుకు ఇష్టం లేదు. వివాహానికి ముందే ఆమెకు సోను అనే యువకుడితో పాత ప్రేమ వ్యవహారం ఉంది. పెళ్లయిన తర్వాత కూడా ఆమె తన ప్రియుడితో నిరంతరం టచ్‌లోనే ఉంది. తమ ప్రేమకు అడ్డుగా ఉన్న భర్త మోనును ఎలాగైనా వదిలించుకోవాలని ఇద్దరూ కలిసి ఒక కిరాతక ప్లాన్ వేశారు.

**పథకం ప్రకారం పిలిపించి..**

జూన్ 8వ తేదీ రాత్రి, భార్య తన్ను పథకం ప్రకారం మోనును కసోలి గ్రామానికి రప్పించింది. అదే సమయంలో ప్రియుడు సోను పంపిన హరిఓమ్, అమన్ అనే ఇద్దరు వ్యక్తులు అక్కడ సిద్ధంగా ఉన్నారు. మోను అక్కడికి చేరుకోగానే, వారు అతడిని గట్టిగా పట్టుకుని, ముక్కు, నోరు మూసేసి ఊపిరాడకుండా చేశారు. మోను స్పృహ తప్పిపోవడంతో, అతడ్ని తీసుకెళ్లి అసల్వాస్ కాల్వలో పడేశారు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు మోను నడుపుతున్న ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కాల్వ ఒడ్డున వదిలేసి పరారయ్యారు.

**అంత్యక్రియల్లో నవవధువు కన్నీటి డ్రామా!**

జూన్ 10న కాల్వలో మోను మృతదేహం లభ్యమైంది. ఎలాంటి గాయాలు లేకపోవడంతో పోలీసులు దీనిని ప్రమాదంగా భావించి కేసు నమోదు చేసి శవాన్ని అప్పగించారు. భర్త చనిపోయాడని తెలియగానే తన్ను తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి అత్తగారింటికి వచ్చింది. శవంపై పడి ఏడ్చింది, అంత్యక్రియల్లో పాల్గొంది, చేయాల్సిన అన్ని ఆచారాలను ఏడుస్తూ పూర్తి చేసింది. దీంతో ఆమె భర్త పోయిన బాధలో ఉందేమోనని అందరూ నమ్మారు.

**ట్విస్ట్ ఇచ్చిన 'డిలీట్ చేసిన చాట్స్'**

జూన్ 11న పోలీసులు మోను మొబైల్ ఫోన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే ఫోన్ తెరిచి చూడగా అందులోని కాల్ హిస్టరీ, చాట్స్ అన్నీ డిలీట్ చేసి ఉండటంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. దీంతో వాళ్లు నిపుణులను కలిసి ఫోన్ డేటాను రికవరీ చేయించారు. ఆ డేటా బయటకు రాగానే సీన్ మొత్తం మారిపోయింది. జూన్ 8న మోను అదృశ్యం కావడానికి ముందు తన్నుకు సోను 49 సార్లు కాల్ చేశాడు. రికవరీ అయిన చాట్స్‌లో తన్ను తనే మోనును రమ్మని పిలిచినట్లు, అలాగే ప్రియుడు సోనుతో కలిసి భర్తను వదిలించుకోవడానికి ప్లాన్ చేసినట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయి.

మోను దశదిన కర్మలు ముగిసేవరకు కుటుంబ సభ్యులు ఓపిక పట్టారు. ఆ తర్వాత ఈ బలమైన ఆధారాలను పోలీసులకు చూపించారు. అయితే స్థానిక కసోలా పోలీసులు మొదట ఈ ఆధారాలను సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో జూన్ 21, జూన్ 30 తేదీల్లో కుటుంబ సభ్యులు డీఎస్పీని కలిశారు. అక్కడ కూడా న్యాయం జరగకపోవడంతో జూలై 2న నేరుగా జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు భార్య తన్నును, హరిఓమ్‌ను అరెస్ట్ చేశారు. విచారణలో తన్ను తన ప్రియుడు సోనుతో కలిసి భర్తను చంపినట్లు అంగీకరించింది. ప్రస్తుతం ప్రియుడు సోను, అతని అనుచరుడు అమన్ పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ సురేందర్ షియోరన్ తెలిపారు.

# కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి యువతిపై అత్యాచారం

## ఐదుగురు అరెస్టు

పుట్టిన రోజు వేడుకల పేరుతో మాయమాటలు చెప్పి, ఓ యువతిని ఐదుగురు

నిందితులు అత్యాచారం చేసిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 30న జరిగిన ఈ ఘటన గురించి బాధితురాలు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి, ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక, బెంగళూరులోని తలఘట్టపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.

“26 ఏళ్ల బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం, ఆమెకు సోమశేఖర్‌తో చానాళ్లుగా పరిచయం ఉంది. దీనితో వారిద్దరూ ఎప్పుడూ ఫోన్?లో మాట్లాడుకుంటూ ఉండేవారు. చాలాసార్లు వాళ్లు బయట కూడా సాధారణంగా కలుసుకునేవాళ్లు. ఈ క్రమంలో అత్యాచార ఘటన జరగడానికి కొన్ని రోజుల ముందు బాధితురాలి పుట్టిన రోజు జరిగింది. ఆ సమయంలో సోమశేఖర్ ఆమెను కలిసి శుభాకాంక్షలు చెప్పలేదు. దీనితో ఇద్దరం కలిసి వేడుక చేసుకుందామని, తలఘట్టపురకు రమ్మని సదరు యువతిని నిందితుడు సోమశేఖర్ ఆహ్వానించాడు.

అతని మాటలు నమ్మిన బాధితురాలు, జూన్ 30 సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో అతను చెప్పిన ఓ హోటల్ సమీపానికి వెళ్లింది. ఆ సమయంలో సోమశేఖర్ తన స్నేహితులను అక్కడికి పిలిపించాడు. పార్టీ తన సొంత ఇంట్లోనే నిర్వహిస్తానని ఆమెకు చెప్పాడు. హోటల్‌కు వెళ్దామని ఆమె చెప్పింది. దీనితో ముందు తన ఇంటికి వెళ్లి, తర్వాత హోటల్‌కు వెళ్దామని పట్టుబట్టాడు. దీనితో సోమశేఖర్ స్నేహితులు నలుగురు ఆమెను నిందితుని ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ వారంతా కొంత సమయం గడిపి భోజనం చేశారు.

ఆ తర్వాత నిందితుల్లో ఒకడైన అంబరీశ్? ఆమెకు మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చాడు. అది తాగిన కొద్దిసేపటికే ఆమెకు తలతిరగడం, నిద్రమత్తు రావడం మొదలైంది. చివరికి ఆమె దాదాపు స్పృహ కోల్పోయింది. దీనితో అంబరీశ్ మొదటగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో మిగిలిన నలుగురు బయట హాల్?లో కూర్చున్నారు. మగతగా ఉండడం వల్ల ఆమె నిందితుడిని వెంటనే గుర్తించలేకపోయింది. కొద్ది సేపటి తర్వాత తనకు స్పృహ రావడంతో ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుంది. తర్వాత పోలీసు అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 112కి కాల్ చేసి తనకు జరిగిన ఘోరాన్ని వివరించింది. దీనితో వెంటనే అప్రమత్తమైన తలఘట్టపుర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను రక్షించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సోమశేఖర్, అంబరీశ్, ప్రదీప్, రామప్ప, జగదీశ్‌లను అనే ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు” అని బెంగళూరు నైరుతి విభాగం డిసీపీ అనిత బి.హద్దన్నవర్ వెల్లడించారు.

# భర్తను చంపి బాత్రూమ్‌లో పాతిపెట్టిన భార్య

## 45 రోజుల ఆగ్రాలో వెలుగుచూసిన ఘటన

భర్తను చంపి శవాన్ని డ్రమ్ములో పెట్టి కప్పివేయడం, లేదంటే కొండపై నుంచి తోసేయడం వంటి వార్తలు ఇటీవల కాలంలో మనం ఎక్కువగా వింటున్నాం. తాజాగా అలాంటి ఘటనే మరొకటి వెలుగులోకి వచ్చింది. ఓ ఇల్లాలు భర్తను చంపి, ఆపై శవాన్ని బాత్రూమ్‌లో పూడ్చిపెట్టింది. అంతేకాదు, ఎవరికి అనుమానం రాకుండా ఆ ప్రదేశంలో కొత్త టైల్స్‌ను ఏర్పాటు చేయించింది. స్థానికులు భర్త గురించి అడగ్గా, కొద్దిరోజులుగా ఆయన కనిపించడం లేదంటూ అందరితో నమ్మబలికింది. చివరికి పోలీసుల ఎంట్రీతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దృశ్యం సినిమాను తలపించే ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భరత్‌పుర్, రంజిత్‌నగర్‌కు చెందిన సురేంద్ర శర్మ (44), భార్య రూబీతో ఆగ్రాలోని రేణుకా ధామ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. అయితే, మే 18న తన భర్త కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులకు చెప్పింది రూబీ. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, రూబీ మాటలపై సురేంద్ర సోదరుడు అనిల్‌కు అనుమానం కలిగింది. తన సోదరుడు అదృశ్యంపై ఆమె తరచూ పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో ఆయన అనుమానం మరింత బలపడింది. తన తల్లి పెన్షన్ డబ్బుల కోసం అనిల్ ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. "తొలుత డబ్బులు విత్‌డ్రా చేశావా? అని రూబీని అడగ్గా తాను చేయలేదని చెప్పింది. నాకు అనుమానం వచ్చి, మా అమ్మను నాతో పాటు బ్యాంకుకు తీసుకెళ్లి అడగ్గా, అప్పటికే విత్‌డ్రా అయినట్లు తెలిసింది. మా అమ్మ బ్యాంక్ ఖాతా పాస్‌బుక్, డెబిట్ కార్డును రూబీ తన వద్దే ఉంచుకుంది. నేను రూబీతో, డబ్బు నాకు ఇవ్వమని అడగ్గా, రూబీ మౌనంగా ఉండిపోయింది. ఆ మర్నాడు ఉదయం 6 గంటలకు, ఆమె నాకు ఫోన్ చేసి తన భర్త ఇంట్లో ఉన్నాడని, అక్కడికి రమ్మని చెప్పింది. నా సోదరుడు సురేంద్రతో మాట్లాడటానికి వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు, రూబీ తన భర్త బాత్రూంలో ఉన్నాడని చెప్పింది. నేను వెళ్లి చూడగా, బాత్రూంలో ఎవరూ లేరు. నేను, "అక్కడ ఎవరూ లేరు" అని చెప్పగా, రూబీ, "రెండు అడుగులు కింద ఉన్నాడు" అని బదులిచ్చింది. అది వినగానే నాకు చాలా భయం వేసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాను" అని అనిల్ పేర్కొన్నాడు.

పోలీసులు ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణ సమయంలో నిందితురాలు పొంతనలేని సమాధానాలు చెబుతూ వచ్చిందని పోలీసులు తెలిపారు. సురేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని, దాన్ని చూసి భయం వేసి మృతదేహాన్ని పాతిపెట్టానని చెప్పిందన్నారు. అయితే, ఆమె మాటలు నమ్మశక్యంగా లేవని అన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక, ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాతే మరణానికి అసలు విషయం తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. "సురేంద్రకు ఉన్న మద్యపాన వ్యసనం వల్ల తరచుగా గొడవలు జరిగేవి. మద్యం సేవించిన తర్వాత నన్ను కొట్టేవాడు. అంతేకాకుండా, నేను ఇంట్లో దుస్తులు కుట్టి సంపాదించినదంతా అతను లాక్కునేవాడు" అని విచారణలో నిందితురాలు చెప్పిందని పోలీసులు తెలిపారు. మరోవైపు, నిందితురాలిని క్షుణ్ణంగా విచారిస్తున్నట్లు ఏసీపీ అమిషా తెలిపారు. పోస్ట్‌మార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, సాంకేతిక విచారణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు.

# ప్రియుడితో కలిసి భార్య దారుణం.. సైనైడ్‌తో భర్త హత్య

## ఓ ఫ్యాక్టరీలో 12 అడుగుల లోతులో పూడ్చిపెట్టేశారు

## రెండేళ్ల తరువాత వెలుగులోకి..

భర్తకు సైనైడ్ ఇచ్చి హత్య చేసి, ఆపై 12 అడుగుల లోతులో పూడ్చిపెట్టిన ఘటన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో సంచలనం సృష్టిస్తోంది. రెండేళ్లుగా భర్త ఆస్ట్రేలియాలో ఉంటున్నాడని, మాట్లాడటం కుదరదని కుటుంబ సభ్యులు, బంధువులను నమ్మిస్తూ వచ్చిన భార్య బండారం ఎట్టకేలకు బయటపడింది. విషయం వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు మహిళే తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు తేల్చారు. ఈ మేరకు నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపారు. పోలీసుల వివరాల ప్రకారం.. జిగ్నేష్ అనే వ్యక్తి రెండేళ్ల క్రితం అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతడితో మాట్లాడేందుకు కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. జిగ్నేష్ ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నాడని, అక్కడి కంపెనీ నిబంధనల కారణంగా ఫోన్‌లో మాట్లాడలేకపోతున్నాడని అతని భార్య పృథ్వి వారికి చెబుతూ వచ్చింది. అంతేకాకుండా శాశ్వత నివాస అనుమతి (పర్మనెంట్ రెసిడెన్సీ)

వచ్చిన తర్వాతే భారత్‌కు జిగ్నేష్ తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులను నమ్మించింది. దీంతో రెండేళ్లపాటు ఎవరికీ అనుమానం రాలేదు. అయితే, ఇటీవల జిగ్నేష్ బంధువుల్లో ఒకరు ఆస్ట్రేలియా వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అతడిని కలవాలని భావించాడు. జిగ్నేష్ ఫోన్ నంబర్, చిరునామా ఇవ్వాలని పృథ్విని కోరాడు. ఎన్నిసార్లు వివరాలు అడిగినా ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాడు. దీంతో సదరు మహిళ అసలు విషయాన్ని కుటుంబ సభ్యుల ముందు బయటపెట్టింది. తన భర్తను రెండేళ్ల క్రితమే హత్య చేసినట్లు వెల్లడించింది. దీంతో జిగ్నేష్ సోదరుడు అశోక్ ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. జిగ్నేష్ భార్య పృథ్వి, ఆమె ప్రియుడు నీలేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని రెండు రోజుల పాటు విచారించగా.. సంచలన విషయాలు వెల్లడయ్యాయి. నిందితులిద్దరూ సైనైడ్ కలిపిన మద్యాన్ని జిగ్నేష్‌కు ఇచ్చి హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. అనంతరం అతడి మృతదేహాన్ని జామ్‌నగర్ శివారులోని ఓ పాడుబడిన ఫ్యాక్టరీలో పాతిపెట్టినట్లు చెప్పారు. సుమారు 12 అడుగుల లోతైన గుంతలో పూడ్చిపెట్టినట్లు పోలీసులకు వెల్లడించారు. మరోవైపు, ఆ ఫ్యాక్టరీని జిగ్నేష్, నీలేశ్ ఇద్దరూ కలిసి లీజుకు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు జిగ్నేష్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనతో భార్య చేతిలో భర్త హత్య అనే అంశం మరోసారి చర్చనీయాంశమైంది.

# పాము కాటుతో భర్తను చంపేసింది

## ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం


వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ భార్య తన భర్తను హత్య చేసింది. ప్రియుడితో కలిసి.. పాము సాయంతో భర్త ప్రాణాలు తీసింది. ఈ సంఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మీరట్‌కు చెందిన అతుల్ పన్వర్, దామిని భార్యాభర్తలు. అతుల్ స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్ నడుపుతున్నాడు. ఆ స్కూల్‌లో డ్రైవర్‌గా పని చేసే తుషార్ అనే వ్యక్తితో దామిని వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే అతుల్ అడ్డు తొలగించుకోవాలని, అతడి పేరు మీద ఉన్న 20 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులు సొంతం చేసుకోవాలని దామిని, తుషార్ భావించారు.

అతుల్‌ను మర్డర్ చేయటం కోసం ఓ పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. ఇందుకోసం పాములు పట్టే వారి సాయం తీసుకున్నారు. ప్లాన్‌లో భాగంగా.. దామిని పాలలో నిద్ర మాత్రలు కలిపి భర్త అతుల్‌కు ఇచ్చింది. అతుల్ ఆ పాలు తాగి స్పృహకోల్పోయాడని ధ్రువీకరించుకున్నాక తుషార్‌కు దామిని ఫోన్ చేసింది. తుషార్ పాములు పట్టే ఇద్దరు

వ్యక్తులను అతుల్ ఇంటి దగ్గరకు తీసుకువచ్చాడు. పాములు పట్టే వ్యక్తులు ఓ పామును అతుల్ ఉన్న బెడ్‌పై వదిలారు. ఆ పాము అతుల్‌ను కాటేసింది. కొన్ని నిమిషాలకే అతడు చనిపోయాడు.అతుల్ పాము కాటు కారణంగానే చనిపోయాడని కుటుంబసభ్యులను, పోలీసులను దామిని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. దామినితో పాటు తుషార్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారించారు. వారి మొబైల్ ఫోన్‌లను తనిఖీ చేయగా.. అందులో పాముల ఫోటోలు, పాములు పట్టే వారితో మాట్లాడిన కాల్ డేటా లభించాయి. దీంతో పోలీసులు దామిని, తుషార్‌లతో పాటు వీరికి సహకరించిన పాములు పట్టే ఇద్దరినీ కూడా అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# ఐదేళ్ల బాలుడిపై టీచర్ దారుణం..
# కాల్చిన కత్తితో వాత పెట్టి..

ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ప్యాంట్స్‌లో మూత్రం పోశాడన్న కోపంతో ఉపాధ్యాయురాలు ఘాతుకానికి ఒడిగట్టింది. కాల్చిన కత్తితో బాలుడి ప్రైవేట్ పార్టుపై వాత పెట్టింది. జులై 24వ తేదీన జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన వివరాల మేరకు.. వారణాసికి చెందిన కేసరీ జైశ్వాల్ దంపతుల ఐదేళ్ల కుమారుడు పాండేపూర్‌లోని సలీన్ సోనీ ప్లే స్కూల్‌లో చదువుతున్నాడు. జులై 24వ తేదీన బాలుడు ఇంటికి రాగానే ప్రైవేట్ పార్ట్ వద్ద నొప్పిగా ఉందని తల్లికి చెప్పాడు. బాలుడి ప్రైవేట్ పార్టుపై వాత ఉండటం చూసి తల్లి షాక్ అయ్యింది. ఏం జరిగిందని కుమారుడిని అడిగింది. బాలుడు తన తల్లితో.. 'మూత్రం వస్తోందని టీచర్‌కు చెప్పాను. ఆమె నన్ను బాత్‌రూముకు వెళ్లనివ్వలేదు. నేను ప్యాంట్స్‌లోనే మూత్రం పోసుకున్నాను. టీచర్ నన్ను వేరే గదిలోకి తీసుకెళ్లింది. స్టవ్‌పై కత్తిని కాల్చి నాకు వాత పెట్టింది' అని చెప్పాడు. ఆగ్రహానికి గురైన బాలుడి తల్లిదండ్రులు మరుసటి రోజు స్కూలు దగ్గరకు వెళ్లారు. బాలుడికి వాత పెట్టిన ఉపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలని స్కూలు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. వారినుంచి సరైన స్పందన రాకపోవటంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పిల్లాడికి వాత పెట్టిన ఉపాధ్యాయిని ప్రీతీ కూశ్వాహాతో పాటు ప్రిన్సిపల్, స్కూలు యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


DIVORCE
కలహాల కాపురానికి విడాకులే పరిష్కారమా?
సఖ్యతలేని జంటలకు పుట్టడమే బిడ్డలు చేసిన నేరమా?

# Form - IV
## (See Rule 8)


Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)




*Our Aim*

*all Human Rights for all*

# Aims Human Rights Society Surveys

**Women and Child Welfare / Freedom / Rights**

Regd. No. 1808/2005

Regd. Off: Plot No.1, H. No.1-24-21/4, (24-387), Sri Sai Nagar,
Lothukunta, Alwal, Secunderabad - 500 015.